


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 18-04-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 189 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### లోక్‌సభ రెండో దశ ఎన్నికలకు

# సర్వం సిద్ధం

**ఈవీఎంల ద్వారా ఓటింగ్ సరళి .. ఈవీఎంలు మొరాయిస్తే సిద్ధంగా నిపుణులు**

**పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు**

న్యూఢిల్లీ: లోక్‌సభ రెండో దశ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఏప్రిల్ 18న దేశంలోని కేంద్ర పాలిత ప్రాంతాలతో కలిపి 13 రాష్ట్రాల్లోని 95 సీట్లకు ఎన్నికలు జరగనున్నాయి. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో ఓట్ల ద్వారా ఆయా నియోజక వర్గాల్లోని ఓటర్లు తీర్పునివ్వనున్నారు. అధికారులు ఈవీఎంలను సిద్ధం చేశారు.. అవి మొరాయిస్తే వెంటనే సరిచేయడానికి నిపుణులను నియమించారు.



తమిళనాడులో 38 (వేలూరు స్థానంలో ఎన్నిక వాయిదా పడింది), కర్ణాటకలో 14, తరువాయి 2లో..

### ఉద్దేశపూర్వకంగా తప్పుచేస్తే

## క్షమించేది లేదు

**కలెక్టర్ల నిర్లక్ష్యతపై మండిపాటు**

**తప్పులు చేస్తే కేసులు తప్పవు**

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి గోపాలకృష్ణ ద్వివేది**



అమరావతి: పోలింగ్ రోజు ఘటనలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి గోపాలకృష్ణ ద్వివేది కలెక్టర్లను వివరణ కోరారు. నియోజకవర్గానికి ముగ్గురు ఈవీఎం నిపుణులను కేటాయించినా సేవలను వినియోగించుకోకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కొన్నిజిల్లాల్లో సాంకేతిక నిపుణులకు రూట్ మ్యాప్‌లు ఇవ్వకపోవడాన్ని సీఈవో ద్వివేది గుర్తించారు. ఎన్నికలకు నాలుగు రోజుల ముందే రాష్ట్రానికి 600 మంది బెల్ ఇంజినీర్లు వచ్చారని, అయినా కలెక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడమేంటని మండిపడ్డారు. సాయంత్రం 6గంటల తర్వాత పోలింగ్‌పై రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా తప్పులు చేసినవారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా పెనమలూరు తరువాయి 2లో..

### ఘనచరిత్ర కలిగిన కాంగ్రెస్

# విమర్శలతో దిగజారింది

- ప్రణాళికలు సిద్ధం చేసుకోలేకపోతోంది
- వెనకబడిన వాణ్ని కనుకనే నాపై దాడి
- ప్రధాని నరేంద్ర మోదీ



మాఢా: ఈ దేశాన్ని 55 ఏళ్లు పాలించిన పార్టీ.. రానున్న ఐదేళ్లలో ఏం చేయాలో ప్రణాళికలు సిద్ధం చేసుకోలేని స్థాయికి దిగజారిందని పరోక్షంగా కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. కేవలం మోదీని గద్దె దించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. చాలా కాలం తరవాత ప్రజలు.. అధికారంలో ఉన్న ప్రభుత్వమే తిరిగి రావాలనుకోవడం చూస్తున్నానని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలు సైతం ఇంటింటికీ తిరిగి ప్రస్తుత ప్రభుత్వానికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మహారాష్ట్రలోని మాఢాలో జరిగిన సభలో పాల్గొన్నారు. ప్రజల ఆశీస్సులతోనే ఐదేళ్ల పాలనను తరువాయి 2లో..

## ఫలితాల కోసం పాలన ఆగదు

**ప్రాజెక్ట్ పనులపై సీఎం సమీక్ష .. ప్రజల సమస్యలు-రాష్ట్రాభివృద్ధే ముఖ్యం**

**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**



అమరావతి : ఎన్నికల ఫలితాలకు ఇంకా నెలరోజులపైనే సమయం ఉందని, అలాగని అప్పటివరకు పాలన పక్కన పెట్టి ఖాళీగా కూర్చోనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడం-రాష్ట్రాన్ని అభివ ృద్ధి పథాన నడిపించడం తనకు ముఖ్యమని చెప్పారు. బుధవారం ఉండవల్లిలోని ప్రజావేదికలో పోలవరం ప్రాజెక్టు పనులపై ముఖ్యమంత్రి 90వ వర్చువల్ రివ్యూ నిర్వహించారు.

జులై కల్లా పోలవరం ప్రాజెక్టు నుంచి నీరిచ్చేలా 60 రోజుల ప్రణాళికతో పనులు వేగవంతం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి తరువాయి 2లో..

## నేడే ఇంటర్ ఫలితాలు

హైదరాబాద్ : తెలంగాణ ఇంటర్ ఫలితాలు గురువారం విడుదల కానున్నాయి. సాయంత్రం 5గంటలకు ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాలను ప్రకటించనున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్ వెల్లడించారు. నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఈ ఫలితాలను విద్యాశాఖ కార్యదర్శి బి.జనార్దన్ రెడ్డి విడుదల చేస్తారని తెలిపారు. ఫిబ్రవరి 27నుంచి మార్చి 16వరకు జరిగిన ఇంటర్ పరీక్షలకు సుమారు 9లక్షల మందికి తరువాయి 2లో..

### ఆచరణ సాధ్యమైన

# హామీలనే ఇస్తా

**కొడుకులా, స్నేహితుడిలా చూడండి**

**కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ**



వయనాడ్: ప్రధాని నరేంద్ర మోదీలా తాను అసంబద్ధమైన హామీలు ఇవ్వనని, ఆచరణ సాధ్యమైన హామీలు మాత్రమే ఇస్తానని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. దక్షిణాది రాష్ట్రంలోని వయనాడ్ నుంచి పోటీ చేయడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ ఆ నియోజక వర్గంలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓ రాజకీయ నాయకుడిగా తాను ఇక్కడికి రాలేదన్నారు. పార్టీలకతీతంగా ఇక్కడి ప్రజలకు తాను మద్దతుగా నిలుస్తానన్నారు. తనని సొంత కొడుకులా, మిత్రునిగా భావించాలని కోరారు. దేశంలోని మిగతా ప్రాంతాలు ఎంత ముఖ్యమో దక్షిణాది కూడా అంతే ముఖ్యమన్న విషయాన్ని చాటడం కోసమే ఇక్కడి నుంచి పోటీచేస్తున్నానన్నారు. తన అభిప్రాయాలు చెప్పడానికి రాలేదని..ఇక్కడి ప్రజల సంస్కృతీ సంప్రదాయాలు నేర్చుకోవడానికి వచ్చానన్నారు. జీవితాంతం ఇక్కడి ప్రజలతోనే ఉంటానని హామీ ఇచ్చారు. ప్రకృతిని, అభివృద్ధిని సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా భాజపా, ఆరెస్సెస్‌లపై విమర్శలు గుప్పించారు. దేశం మొత్తం ఒకే సిద్ధాంతాన్ని రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అంతకు ముందు పార్టీ పార్లమెంటరీ కమిటీతో రాహుల్ తరువాయి 2లో..

### శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించాలి...

**ఈఓ అనిల్ కుమార్ సింఘాల్**



తిరుమలః ఒంటిమిట్టలో నిర్వహించనున్న కల్యాణానికి వచ్చే భక్తుల ఏర్పాట్ల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. టిటిడి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ మంగళవారం తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనంలో సీనియర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలో టీవీల్లో పిల్లలకు ఉపయోగపడేలా కార్టూన్, యానిమేషన్ చిత్రాలు, శ్రీవారి పౌరాణిక ప్రాశస్త్యాన్ని, తిరుమల, తిరుపతిలోని ఆలయాలు, వాటి దూరం, ఎలా వెళ్లాలి అనే విషయాలను తెలిపేలా కథనాలను ప్రసారం చేయాలని ఆదేశించారు. శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధుల్లో భూగర్భ కేబుళ్లను మే చివరి నాటికి పూర్తి చేయాలని తరువాయి 2లో..




## ఓడిపోతామనే భయంతోనే బాబు వ్యాఖ్యలు



విజయవాడ : టీడీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు వింటుంటే ఆశ్చర్యం కలుగుతోందని, ఆయన రకరకాల ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు. ఒకవేళ ఎన్నికలు లోపభూయిష్టంగా జరిగితే టీడీపీకి 150 సీట్లు ఎలా వస్తాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. అంబటి రాంబాబు బుధవారం విజయవాడలో పార్టీ కార్యాలయంలో తరువాయి 2లో..



# సేవా కార్యక్రమాలతోనే సంస్థ ఉన్నత శిఖరాలకు చేరుతుంది



విశాఖపట్నం : ఎలయన్స్ క్లబ్ విశాఖపట్నం నార్త్ ఈస్ట్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం డాబాగార్డెన్స్ పరిధిలో గల ఫంక్షన్ హాల్‌లో జరిగింది. 2019-2020కి గాను అధ్యక్షునిగా కందుల మధుబాబు కార్యదర్శిగా ఎ. వెంకట పూర్ణ చంద్రశేఖర్, కోశాధికారిగా జవ్వాది లక్ష్మణ రావులు ఎన్నికైనారు. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎలయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బి.ఎస్. మాణ్యం హాజరైనారు. అనంతరం ఆమె నూతన కార్యవర్గాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ సేవా కార్యక్రమాలతేనే సంస్థ ఉన్నత శిఖరాలకు చేరుతుందన్నారు.

సంస్థలో చేరిన ప్రతి సభ్యుడు నిస్వార్థ సేవలందించి సంస్థ ఉన్నతికి దోహదపడాలని కోరారు. ఇన్‌స్టలేషన్ అధికారిగా మట్టపల్లి విశ్వేశ్వరరావు వ్యవ హరించగా ఇండక్షన్ అధికారి ఎస్.సాయిరాం నూతన కార్యవర్గ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

గౌరవ అతిథు లుగా ఆచార్య ఎన్.రామకృష్ణ, పి.వెంకటరావు, కె.రాజే శ్వరరావు, పి. హిమకర్, ఎ. ఉమామహేశ్వరరావు, ప్రత్యేక ఆహ్వా నితులుగా టి.పి. గాంధీ, బి.తిరుపతిరాజు, పి. శాంతమ్మ వీరితో పాటు ఎస్.సోమరాజు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ తది తరులు పాల్గొన్నారు. నూత నంగా ఎంపికైన సంస్థ అధ్యక్షులు కె. మధు బాబు, కార్యదర్శి ఎ. వెంకట పూర్ణచంద్రశేఖర్, కోశాధికారి జె.లక్ష్మణ రావు, సంస్థ ఉన్నతికి కృషి చేస్తామని హామీ ఇచ్చి వీరిని ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం




పైడిభీమవరం : గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల విద్యార్థులున్నారని అరబిందో పరిశ్రమ సీఎస్ఆర్ కార్యకలాపాల అసోసియేట్ ఉపా ధ్యక్షుడు గోపాలకృష్ణారెడ్డి అన్నారు. పైడిభీవరం ఉన్నత పాఠశాలలో అరబిందో ఫార్మా ఫౌండేషన్, ఏబీసీడీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాలక ృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజల ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పోటీపరిక్షల కోసం పట్టణా లకు వెళ్లి చదువుకోవడం వ్యయ ప్రయాసలతో కూడుకున్నదన్నారు. అందుకే గ్రామీణ విద్యా ర్థుల ప్రతిభను వెలికి తీయడానికి గత మూడేళ్లగా అరబిందో ఫౌండేషన్ కార్పోరేట్ సామాజిక బాధ్యతగా ఉచితంగా శిక్షణా శిబిరం ఏర్పాటు చేస్తుందన్నారు. ఇందుకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేస్తున్నామన్నారు. విద్యార్థు లందరూ శిక్షణ తరగతులు సద్వి నియోగం చేసుకోవాలన్నారు. ఈ శిక్షణలో ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్ ప్రవేశపరిక్షలకు తర గతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్య క్రమంలో ఏబీసీడీ స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యక్షుడు జి.అప్పల నాయుడు, అరబిందో ప్రతినిధులు పుష్ప కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు భోజనం సమకూర్చిన వృద్ధమిత్ర



విజయనగరం: స్థానిక ట్రాఫిక్ పోలీసు స్టేషనులో పని చేయుచున్న హెడ్ కానిస్టేబులు పట్టణంలోని మూడులాంతర్లు జంక్షన్ పరిసరాలలో సంచరిస్తున్న కొంత మంది పేద వృద్ధులకు భోజనం బుధవారం సమకూర్చారు. విజయనగరం ట్రాఫిక్ హెడ్ కానిస్టేబులుగా పనిచేయుచూ, మూడు లాంతర్లు వద్ద విధులు నిర్వహిస్తున్న ఎస్. నాగఆదిత్యకు మూడులాంతర్లు పరిసరాల్లో ఆకలితో ఉన్న 5గురు వృద్ధుల్ని గుర్తించారు. వెంటనే, వారి వివరాలు తెలుసుకొని, యోగక్షేమాలు గురించి విచారించారు. వృద్ధుల అవసరాలను గుర్తించి, వారికి భోజనం ఏర్పాటు చేశారు.జిల్లా ఎస్పీ శ్రీ ఎ.ఆర్.దామోదర్ వృద్ధుల రక్షణకు చేపడు తున్న చర్యల పట్ల ఆకర్షితులై, తాము కూడా వృద్ధులకుఏదో రకంగా సేవలందించాలనే లక్ష్యంతో కార్యక్రమాలు చేపడు తున్నట్లుగా ట్రాఫిక్‌హెచ్‌సి ఎస్.ఎన్.ఆదిత్య తెలిపారు.

# మాతృ మరణాలను తగ్గించాలి




అరసవల్లి : జిల్లాలో మాతృ మరణాలను తగ్గించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డా.ఎం.చెంచయ్య సిబ్బందిని ఆదేశించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో మాతృ మరణాలపై సబ్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరిగిన 18 మాతృ మరణాలు ఎలా జరిగాయో చెప్పాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బందిని ప్రశ్నించారు. మాతృ మరణాలు సంభవించే కారణాలను అడిగారు. వాటిని తగ్గించేందుకు ప్రయత్నించాలని ఆదేశించారు. హై రిస్క్ కేసులను మొదటిగా గుర్తించి వారికి సరైన సమయంలో వైద్య సేవలు అందిస్తే, మాతృ మరణాలు తగ్గించవచ్చునన్నారు. ప్రతి గర్భిణి ప్రసవానికి రెండు రోజుల ముందుగా ఆసుపత్రిలో చేరేలా చూడాలని వైద్యాధికారులను ఆదేశించారు.

# జాగృతి సొసైటీ ఆధ్వర్యంలో ఇన్సూరెన్స్ చెక్ పంపిణీ

సబ్బవరం : మండలంలోని అమరపినివానిపాలెం గ్రామంలో జాగృతి సభ్యులైన పెట్లు బంగారమ్మ వైఫ్ ఆ ఫ్ గంగరాజు ఈమె రోడ్డు ప్రమాదంలో ఇటీవల చనిపోయింది.ఈ బంగారమ్మ జాగృతి సొసైటీలో పొదుపు చేస్తూ ఇంటి అవసరాలు నిమిత్తం 50 వేలు రూపాయలు అప్పు తీసుకుంది. ఈమె జాగృతి సొసైటీ ఇన్సూరెన్స్ కూడా చేయించడం జరిగింది.

ఆమె చనిపోయిన కారణంగా ఇన్సూరెన్స్ క్లెయిమ్ రావడం జరిగింది. ఆమె వారసుడైన పెట్లు ఈశ్వరరావుకు 50 వేలు రూపాయలు ఇన్సూరెన్స్ చెక్‌ను జాగృతి చీఫ్ మేనేజర్ కె.సుజాత బుధవారం ఆమె అందజేశారు.

ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ జాగృతి సభ్యులందరూ ఈ ఇన్సూరెన్స్ పథకంలో చేరాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఆర్ సంధ్యావళి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# ప్రేమతత్వమే ఆధ్యాత్మికతకు నిదర్శనం

## – సూఫీమహాత్మ అతావుల్లా బాబా



విజయనగరం: బాబా వారి 60వ గంధమహొత్సవంలో భాగంగా బుధవారం ఉదయం నుంచి చాదర్, దస్తార్ బందీ, దీపాంాధన, ప్రసాదాల పంపిణీతో భక్తులు కోలాహలంగా సంబరాన్ని జరుపుకున్నారు. దర్గా షరీఫ్‌లో ఖవ్వాలి కార్యక్రమం పలువురుని ఉర్రూతలూగించింది. మధ్యాహ్నం వేలాది మందికి అన్న సమారాధన జరిగింది. వేలాది మంది భక్తులు చాదర్ సమర్పిం చారు.దర్గాలో జరిగిన ఖుల్ కార్య క్రమం.. బాబా వారిజెండా ఉత్సవంలో ఫకీర్‌మేళా మధ్య ఉత్సాహంగా జరిగింది.పేదప్రజలపట్ల ప్రేమతో పలకరించి వారి సమస్యలను పరిష్కరించడానికి ఎవరైతే నిస్వార్థంగా కృషిచేస్తారో వారికి హజరత్ ఖాదర్ వలి (ర.అ)వారి ఆశీసులతోపాటు మంచి అవకాశాలు కల్పించే ఆశీర్వాదం లభిస్తుందని సూపీమహత్మ అతావుల్లా షరీఫ్ షా ఖాదరీ బాబా వారు అన్నారు. బాబావారిని దర్శించిన వారిలో సమతానంద స్వామి లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ బాబా వారి 60వ గంధమహొత్సవ సందర్భంగా దర్బార్‌ను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సూఫీ మహాత్మ అతావుల్లా షరీఫ్ షా ఖాదరీ బాబా



వారితో మాట్లాడగా సాటివారిని ప్రేమతో చూడటమే నిజమైన ఆధ్యాత్మికతకు నిదర్శనమన్నారు. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆంధ్రప్రదేశ్ ముహమ్మద్ ఇలియాస్ రిజ్వీ (ఐఎఫ్ఎస్), ప్రసిద్ధ కవి, రచయిత ఖాదర్ మొహియుద్దీన్, ప్రసిద్ధ ప్రజాకళాకారులు వంగపండు ప్రసాదరావు, డిఎఫ్ఓ లక్ష్మణరావు, తదితర జిల్లా అటవీశాఖ అధికారులు బాబావారిని దర్శించుకుని చాదర్ సమ ర్పించారు .నిర్వాహకులు జి.ఎం.జాఫర్ షరీఫ్, ఎం.డి.ఖ్వాజా మొహియుద్దీన్, డాక్టర్ ఎం.డి.ఖలీలుల్లా ఫరీఫ్,ఎం.డి.ఖాదర్ బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మొదటి పేజీ తరువాయి

## శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించాలి...

ఇంజినీరింగ్, ఎస్వీబీసీ అధికారులను ఆదేశించారు. అలిపిరి నడక మార్గంలో నాటిన 10 వేల మొక్కలను సంరక్షించాలని, మొదటి ఘాట్ రోడ్డులో ఇరువైపులా నాటిన మొక్కలు బాగా పెరిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో అటవీప్రాంతంలో అగ్నిప్రమాదాలను అరికట్టేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తిరుమల, ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న ఇంజినీరింగ్ పనులపై ఈవో సమీక్షించారు. అమరావతి, కన్యాకుమారి, కురుక్షేత్ర, అరకు, పార్వతీపురం, సీతంపేట, రంపచోడవరంలో జరుగుతున్న ఇంజినీరింగ్ పనుల ప్రగతికి సంబంధించిన ఫొటోలను వచ్చే సమావేశంలో చూపాలన్నారు. అప్పలాయగుంటలో జరుగుతున్న పనులను స్వయంగా వచ్చి పరిశీలిస్తామన్నారు. శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయం వెనుకవైపు భక్తుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన పార్కింగ్ ప్రదేశం గురించి ఎక్కువ మంది భక్తులకు తెలిసేలా ఆలయంలో ఫ్లెక్సీ బోర్డుల ఏర్పాటుతోపాటు అనౌన్స్‌మెంట్ చేయాలన్నారు. ఈ సమావేశంలో టిటిడి తిరుమల జెఈవో కె.ఎస్.శ్రీనివాసరాజు, తిరుపతి జెఈవో బి.లక్ష్మీకాంతం, ఎఫ్ఏసిఏవో ఓ.బాలాజి, చీఫ్ ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఘనచరిత్ర కలిగిన కాంగ్రెస్ విమర్శలతో దిగజారింది

విజయవంతంగా పూర్తి చేసుకున్నానని అభిప్రాయపడ్డారు. భారీగా హాజరైన కార్యకర్తలను ఉద్దేశిస్తూ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవార్ పోటీ నుంచి ఎందుకు తప్పుకున్నారో ఇప్పుడు అర్థమవుతోందని మోదీ అన్నారు. గాలి ఎక్కడ వీస్తే పవార్ ఆ గూటికి చేరతారని విమర్శించారు. భాజపా పాలనకు ముందు ముంబయి.. ఉగ్రవాదులకు స్వర్గధామంగా ఉండేదన్నారు. ఒకప్పుడు కేవలం నన్ను మాత్రమే దూషించిన కాంగ్రెస్.. ఇప్పుడు సమాజం మొత్తాన్ని విమర్శిస్తుందన్నారు. వెనకబడిన వర్గానికి చెందిన కారణంగానే కాంగ్రెస్ తనని లక్ష్యంగా చేసుకుందన్నారు. దేశంలో ఓ వర్గం మొత్తాన్ని దొంగలుగా అభివర్ణిస్తున్నారన్నారు. పరోక్షంగా దొంగలంతా మోదీ పేరుతో ఉన్నారని రాహుల్ చేసిన వ్యాఖ్యల్ని ఆయన తప్పుబట్టారు. దేశం అభివృద్ధి దిశలో సాగాలంటే తిరిగి భాజపాయే అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల ఎన్సీపీ నుంచి భాజపాలో చేరిన రంజిత్ సిన్హా, ఆయన తండ్రి ఎన్సీపీ నేత విజయ్‌సిన్హా పాటిల్.. మోదీతో కలిసి వేదికను పంచుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రధాని సంతాపం ప్రకటించారు.

## జూలైలో పోలవరం నీరు

నిర్దేశించారు. మార్చి, ఏప్రిల్‌లో 45 రోజుల పాటు పనులు మందకొడిగా సాగడంపై అసంత ృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల సమయం కావడంతో జరిగిన ఆలస్యాన్ని అధిగమించేలా చర్యలు తీసుకోవాలని జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులకు సూచించారు. 42.5 మీటర్ల ఎత్తులో కాఫర్ డ్యామ్ నిర్మించాల్సి ఉందని, అయితే జూన్ కల్లా 35 మీటర్ల ఎత్తున నిర్మాణాన్ని పూర్తి చేయాలని చెప్పారు. స్పిల్ వే, స్టిల్లింగ్ బేసిన్ ముందుగా నిర్మించి స్పిల్ చానల్ పనులు అనుకున్న సమయానికి పూర్తయ్యేలా చూడాలన్నారు. పోలవరం నిర్వాసితులకు చేపట్టిన పునరావాసం పనులు కూడా సమాంతరంగా పూర్తికావాలన్నారు.

జూన్ 20 నుంచి గోదావరి ప్రవాహం సగటున 5 లక్షల క్యూసెక్కులు ఉండొచ్చని అధికారులు వివరించగా, అంతకుమించి వరద పోటెత్తినా పనులకు ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టు మొత్తం 69% పూర్తికాగా, తవ్వకం పనులు 84.60%, కాంక్రీట్ పనులు 72.40% పూర్తయినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. కుడి ప్రధాన కాలువ 90.87%, ఎడమ ప్రధాన కాలువ 70.38%, రేడియల్ గేట్ల ఫ్యాబ్రికేషన్ 66.22%, ఎగువ కాఫర్ డ్యామ్ పనులు 40.71%, దిగువ కాఫర్ డ్యామ్ పనులు 25.04% పూర్తయినట్టు అధికారులు పేర్కొన్నారు.

మొత్తం 38.88 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులకు గాను 28.16 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు, 1169.56 లక్షల క్యూబిక్ మీటర్ల తవ్వకం పనులకు గాను 989.16 క్యూబిక్ మీటర్ల వరకు పనులు పూర్తయినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గతవారం స్పిల్ వే, స్పిల్ చానల్, పైలట్ చానల్, అప్రోచ్ చానల్, లెఫ్ట్ ఫ్లాంక్‌కు సంబంధించి 3.43 లక్షల క్యూబిక్ మీటర్ల మేర తవ్వకం పనులు పూర్తికాగా, స్పిల్ వే, స్పిల్ చానల్, స్టిల్లింగ్ బేసిన్‌కు సంబంధించి 31 వేల క్యూబిక్ మీటర్ల వరకు కాంక్రీట్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పనులకు సంబంధించి రాష్ట్రానికి కేంద్రం ఇప్పటికి రూ.4,508.35 కోట్లు బకాయి పడిందని అధికారులు చెప్పారు.

గేటెడ్ కమ్యూనిటీల్లా నిర్వాసితుల కాలనీలు

తూర్పుగోదావరి జిల్లా దేవీపట్నం మండలంలోని ఇందుకూరులో 660 ఎస్టీ నిర్వాసిత కుటుంబాలకు నిర్మిస్తున్న కాలనీని గేటెడ్ కమ్యూనిటీ తరహాలో తీర్చిదిద్దుతున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఒక్కో నిర్వాసిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా లక్ష రూపాయలు ఇవ్వడంతో కమ్యూనిటీ హాలు, పార్కు, ఆటస్థలం, అంగన్ వాడీ భవనం, న్యూట్రీ గార్డెన్, షాపింగ్ కాంప్లెక్స్, వెటర్నరీ హాస్పటల్ తదితర 24 మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ఇళ్లు విశాలంగా నిర్మిస్తున్నామని, 15 రోజులకోసారి పనులను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ప్రతి ఇంటి చుట్టూ గార్డెన్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. గిరిజనులు కోళ్ల, గేదెలు, ఆవులు వంటివి పెంచుకునేందుకు సామూహిక వసతులు కల్పించడంతో పాటు, విద్యుత్ సదుపాయంతో దోబీ ఘాట్లు ఏర్పాటు చేయాలని నిర్దేశించారు.

సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ముఖ్యమంత్రి కార్యదర్శి ఏవీ రాజమౌళి, పోలవరం ఆర్ అండ్ ఆర్ కమిషనర్ రేఖారాణి, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆచరణ సాధ్యమైన హామీలనే ఇస్తా

సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భాజపాపై విరుచకుపడ్డారు. దేశాన్ని విభజించి, ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలకు మోదీ పాలనే కారణమన్నారు. వారు అనుసరిస్తున్న విధానాలతో పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో తీవ్ర సంక్షోభం నెలకొందన్నారు. అంతకుముందు వయనాడ్ ప్రాంతంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరునెల్లిలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడో విడతలో భాగంగా ఏప్రిల్ 23న కేరళలోని 20లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

## ఉద్దేశపూర్వకంగా తప్పుచేస్తే క్షమించేది లేదు

నియోజకవర్గంలో కొన్ని కేంద్రాల ఈవీఎంలను ఆర్వో ఆలస్యంగా ఇవ్వడంపైనా నివేదిక కోరారు. శ్రీకాకుళం జిల్లా రాజాంలో మైనర్లు ఓటు వేసిన ఘటనపై నివేదిక పంపాలని ఆ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

## నేడే ఇంటర్ ఫలితాలు

పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ ఫలితాలను https://www.eenadu.net, http://eenadupratibha.netలలో తెలుసుకోవచ్చు.

## లోక్‌సభ రెండో దశ ఎన్నికలకు సర్వం సిద్ధం

మహారాష్ట్రలో 10, ఉత్తర్‌ప్రదేశ్‌లో 8, అసోంలో 5, బిహార్‌లో 5, ఒడిశాలో 5, ఛత్తీస్‌గఢ్‌లో 3, పశ్చిమబెంగాల్ 3, జమ్మూకశ్మీర్ 2, మణిపూర్ 1, పుదుచ్చేరి 1 స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. రెండో దశ ఎన్నికల్లో మాజీ ప్రధాని దేవెగౌడ, కాంగ్రెస్ నేతలు వీరప్పమొయిలీ, రాజ్‌బబ్బర్, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) నేత ఫరూఖ్ అబ్దుల్లా, భాజపా నాయకురాలు హేమమాలిని, డీఎంకే నాయకురాలు కనిమొళి పోటీ చేస్తున్న స్థానాలు ఉన్నాయి.

ఒడిశాలో రెండో దశలో 35 అసెంబ్లీ స్థానాలకూ పోలింగ్ జరుగనుంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పోటీ చేయనున్న హింజిలి, బిజేపూర్ అసెంబ్లీ నియోజక వర్గాలకు ఈ దశలోనే ఎన్నికలు జరగనున్నాయి.

## బాబు వ్యాఖ్యలు వింటుంటే ఆశ్చర్యమేస్తోంది..

మీడియా సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ఓడిపోతున్నారు అని తెలిసే రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారు. చంద్రబాబు నువ్వు తాత్కాలిక సీఎంగా ఉండి పోలవరంపై ఎలా రివ్యూ చేస్తావ్. ఇక కోడెల శివప్రసాదరావు ఇనిమెట్ల బూత్‌లోకి వెళ్లి తలుపులు వేసుకుని రిగ్గింగ్‌కు ప్రయత్నించారు. కోడెలపై ఫిర్యాదు చేఏస్తే నాలుగు వరకూ పోలీజులు కేసు నమోదు చేయలేదు. పోలీసులు కోడెల శివప్రసాద్ చేతిలో కీలుబొమ్మలా మారారు. ఆయనపై పోలీసులు ఎందుకు వెంటనే కేసు నమోదు చేయలేదు. కోడెల శివప్రసాదరావు పోలింగ్ కేంద్రాన్ని క్యాప్చరింగ్ చేసే వ్యక్తి. క్రిమినల్ మైండ్‌తో రాజకీయాలు చేయడం ఆయనకు అలవాటు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఎవరైనా తలుపులు వేసుకుంటారా?. ఆయన రిగ్గింగ్‌కు ప్రయత్నించడంతోనే ఇనిమెట్ల గ్రామస్తులు తిరగబడ్డారు. కోడెల 40 ఏళ్ల రాజకీయ చరిత్ర కుట్రలు, కుతంత్రాలు, దౌర్జన్యాలే. ఆయన అహంకారంతో మాట్లాడుతున్నారు. కోడెల నాకంటే కేవలం 928 ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చి గెలిచారు. 23మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయిస్తే స్పీకర్‌గా ఏం చర్యలు తీసుకున్నారు. మా పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయిస్తే నువ్వేం చర్యలు తీసుకున్నావ్. నరసరావుపేటలో కూడా టీడీపీ అభ్యర్థులని ఓడిస్తుంది నువ్వు కాదా?. కోడెలది దుర్మార్గపు మనస్తత్వం. నీ ఇంట్లో పేలిన బాంబుల వల్ల మరణించిన కుటుంబాలకు నువ్వేం చేశావ్. నరసరావుపేట, సత్తెనపల్లి ప్రజలకు కోడెల నరకం చూపించారు. ఓటమి భయంతోనే కోడెల డ్రామాలు ఆడుతున్నారు. ఆయనతో పాటు కలిసి పోలింగ్ బూత్‌లోకి వెళ్లిన గన్‌మెన్‌లను కూడా వెంటనే సస్పెండ్ చేయాలి అని డిమాండ్ చేశారు.

# మళ్లీ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడే

## గంటా నూకరాజు



భీమునిపట్నంః భీమిలి డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శి గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ వారంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో భీమిలి డివిజన్ లో జరిగిన ఎన్నికల విధానంపై బూత్ కన్వీనర్లు, బూత్ ఏజెంట్లు, జన్మభూమి కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు తో చర్చించారు. ఈ సందర్భంగా డివిజన్ అద్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ. భీమిలి డివిజన్ లో ఉన్న 22 బూత్ లలో కూడా యువత, మహిళలు అధికంగా పాల్గొన్నారని, మన ప్రియతమ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, డ్వాక్రా ఆడపడుచులకు పసుపు - కుంకుమ కింద ఇస్తున్న పథకాలు కారణంగా మహిళా ఓటర్లు ప్రతీ బూత్ లో పెరిగారని ఇది తెలుగుదేశం పార్టీ కి విజయానికి నాంది అని తెలియజేసారు. భీమిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సబ్బం హరి , విశాఖ పార్లమెంట్ అభ్యర్థి శ్రీభరత్ అత్యధిక మెజారితో గెలుస్తున్నారని మరలా రెండవసారి నవ్యాంధ్రప్రదేశ్ కి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయడం తథ్యం అని అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తెలుగుదేశం పార్టీని గెలిపించాలనే ద ృఢ సంకల్పంతో నెల రోజుల పాటు అహర్నిశలు కష్టపడి పనిచేసిన మహిళలు, వ ృద్ధులు, దివ్యాంగులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలకు హ ృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు .

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గాడు సన్యాసినాయుడు, కాసరపు నాగరాజు, పెంటపల్లి యోగీశ్వరావు, మారోజు సంజీవకుమార్, గిడుతూరి శ్రీనివాసరావు, కనకల అప్పలనాయుడు, అప్పికొండ నూకరాజు, చురకల రమణ, దాసరి వెంకటేష్, కొక్కిరి అప్పన్న, వాడమొదలు సత్యారావు, కాసరపు ఎల్లాజి, గండిబోయిన పొలిరాజు, గూడుపు రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన దివ్యాంగ విద్యార్థికి అభినందనలు

రావికమతంః దివ్యాంగులకు భవిత కేంద్రాల్లో ఇస్తున్న శిక్షణ మంచి ఫలితాలు ఇస్తుందని సర్వశిక్ష అభియాన్, జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎన్.శ్రీదేవి అన్నారు. కేంద్రంలో పదో తరగతి వరకూ శిక్షణ పొంది కొత్తకోట జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన చేకూరి గణేష్(మానసిక దివ్యాంగుడు) 5.5 పాయింట్లు సాధించడంతో బాలుడ్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొంప గ్రామానికి చెందిన గణేష్‌ది నిరుపేద కుటుంబం కావడంతో తల్లిదండ్రులు భవిత కేంద్రంలో అప్పగించారన్నారు. ఇటువంటి విద్యార్థులకు ప్రభుత్వం చేయూతనిస్తుందనానరు. చదువులో ప్రతిభ చూపుతున్న దివ్యాంగు విద్యార్థులకు సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ అవకాశాలు కూడా కల్పించి ఉపాధి చూపిస్తామని తెలిపారు. దివ్యాంగుల పట్ల ఎంతో ప్రేమానురాగాలు, సేవాభావంతో వ్యవహరిస్తున్నట్లు ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాధనాయుడును ఆమె అభినందించారు.

# లంబసింగి పిహెచ్‌సిలో ప్రజలకు వైద్యం అందించాలి

చింతపల్లిః విశాఖ జిల్లా చింతపల్లి మండలం లంబసింగి పిహెచ్‌సికి గత కొన్ని రోజుల నుంచి వైద్యాధికారులు విధులకు హాజరుకావడంలేదు. దీంతో ఆ పిహెచ్‌సి పరిధిలో వున్న గ్రామాల ప్రజలు ఆసుపత్రికి వచ్చి డాక్టర్లు లేకపోవడంతో వెనుక తిరుగుతున్నారు. ఈ పిహెచ్‌సిలో వున్న ఇద్దరు వైద్యాధికారులు విధులకు రాకపోవడంతో వైద్యం అందక గిరిజన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోగులకు స్టాఫ్ నర్సులే వైద్యసేవలందిస్తున్నారు. గతంలో కూడా ఇదే పిహెచ్‌సిలో వైద్యులు సక్రమంగా హాజరుకావడంలేదని స్థానిక ప్రజలు ఆందోళన చేశారు. విధులకు రాకుండా తరుచూ గైర్హాజరవుతున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

గతంలో ముంచంగిపుట్టు పిహెచ్‌సిలో సకాలంలో వైద్యం అందకపోవడం వలన ఇద్దరు గిరిజనులు, ఇద్దరు పసికందులు మృత్యువాత పడ్డారు. ఆ విషయంలో కూడా జిల్లా అధికారులు సక్రమైన చర్యలు తీసుకోకపోవడం వలనే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయి. ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతంలో వైద్యం అందక గిరిజన ప్రజలు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఏ చిన్న జ్వరం వచ్చినా అర్ధాంతరంగా తనువుచాలిస్తున్న ఘటనలు అనేకం వుంటున్నాయి.

కావున తమరు వెంటనే జోక్యం చేసుకొని చింతపల్లి మండలం లంబసింగి పిహెచ్‌సి వైద్యులపై చర్యలు తీసుకొని గిరిజన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు

# 20, 21వ తేదీల్లో మధుమేహ నివారణ వైద్య శిబిరం

## ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో..

డాబాగార్డెన్స్: ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో రాజయోగ మెడిటేషన్ విధానంలో "గుడ్ బై టు డయాబెటిస్ " షుగర్ వ్యాధి గ్రస్తులకు ఈనెల 20, 21 తేదీల్లో విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర ఉన్న సెంట్రల్ పార్క్ లో మధుమేహం నివారణ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బ్రహ్మకుమారి పీఠం ప్రతినిధి సోదరి రమ తెలియజేశారు. బుధవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మౌంట్ అబు లో ఉన్న గ్లోబల్ ఆస్పత్రి, పరిశోధన సెంటర్ సౌజన్యంతో 1991 నుంచి మధుమేహ నివారణ ఉచిత వైద్య సేవలను ప్రజలకు ఉచితంగా అందజేస్తున్నట్లు ఆమె తెలియజేశారు. సుప్రసిద్ధ డయాబెటిక్ వ్యాధి నివారణ నిపుణులు డాక్టర్ శ్రీమంత్ సాహూ దేశవిదేశాలలో అనేక సేవా కార్యక్రమాలు అందిస్తూ ఈనెల 20, 21 తేదీల్లో విశాఖ వస్తున్నారని, వారి సారథ్యంలో ఈ ఉచిత డయాబెటిక్ నివారణ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. 20న శనివారం ఉదయం 5.30 గంటలకు యోగా వాకింగ్ తో వైద్య శిబిరం మొదలవుతుందని తెలిపారు. ఈ యోగా వాకింగ్ లో కేజీహెచ్ పర్యవేక్షణఅధికారి డాక్టర్



జి.అర్జున, విశాఖ డయాబెటిక్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ కె వి సుబ్రహ్మణ్యం, కేజీహెచ్ ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్, డాక్టర్.సత్యశ్రీ, మా సంస్క ృతి కళాపరిషత్ అధ్యక్షులు లక్ష్మీ భార్గవి, లక్కీ షోరూం మేనేజింగ్ డైరెక్టర్ స్వామి తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో వి జె ఎఫ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, కార్యదర్శి ఎస్ దుర్గారావు, డాక్టర్ శ్రీమంత్ సాహూ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి పన్ను రాయితీపై ప్రచారం

యలమంచిలి రూరల్ః ఆస్తి పన్ను ఒక్కసారిగా చెల్లిస్తే 5శాతం రాయితీ ఇస్తామని మున్సిపల్ కమిషనర్ సింహాచలం అన్నారు. పుర ప్రజల సౌకర్యార్థం ఈ అవకాశం కల్పించామన్నారు. ఈ విషయం విస్తృతంగా ప్రచారం చేసేందుకు వార్డుల్లో పోస్టర్‌లను ఆవిష్కరించి ప్రచారం చేశారు. 2019-2020 ఆర్థిక సంవత్సరానికి గాను రెండు వాయిదా ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్ను ఒక్కసారిగా చెల్లిస్తే రాయితీ పొందవచ్చునన్నారు. ఆలస్యంగా చెల్లిస్తే 2 శాతం అపరాద రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. పుర ప్రజలు ఈ విషయం గమనించి సహకరించాలని కోరారు.

# పశుగ్రాసం పెంపకంపై రైతుల దృష్టి

నాతవరంః మండలంలో పశుగ్రాసంపై రైతులు దృష్టి సారించారు. ఈ ప్రాంతంలో అధిక శాతం రైతులు పాడి పైనే ఆధారపడి జీవనం సాగిస్తారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు అనుకూలించకపోవడంతో తీవ్రంగా పశుగ్రాసం కొరత ఏర్పడింది. వేసవిలో పశుగ్రాసం సమస్య తలెత్తకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. పశు వైద్యశాలల ద్వారా సరఫరా చేసిన విత్తనాలతో గ్రాసం సాగు చేస్తున్నారు. వ్యవసాయ బోర్ల సాయంతో గుమ్మడిగొండ, వెదురుపల్లి, నాతవరం, వల్సంపేట, చమ్మచింత, మన్యపురట్ల, మర్రిపాలెం, వెన్నలపాలెం, డి.యర్రవరం, బెన్నవరం తదితర ప్రాంతాల్లో అధికంగా పశుగ్రాసం పెంచుతున్నారు. కనీసం వేసవి పూర్తయ్యేం వరకైనా పశు గ్రాసం కొరత లేకుండా ఉండేందుకు రైతులు జాగ్రత్త వహిస్తున్నారు.

# అంధకారంలో గరిమండ

కొయ్యూరుః మండలంలోని బూదరాళ్ల శివారు గరిమండ గ్రామంలో మూడు రోజులుగా అంధకారం నెలకొంది. గత ఆదివారం సాయంత్రం పిడుగులతో పాటు కురిసిన భారీ వర్షానికి పట్టలపాడు వద్ద విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

దీనిని సరి చేసి విద్యుత్‌ను పునరుద్దరించే చర్యలపై సంబంధిత శాఖ అధికారులు జాప్యం చేయడంతో గరిమండలో చీకటి రాజ్యమేలుతోంది.

ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ పునరుద్దరణకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# వడ్డిపలో క్షీణించిన పారిశుద్యం

రోలుగుంటః వడ్డిపలో పారిశుద్యం క్షీణించింది. రెండు నెలలుగా అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. దీంతో పరిపాలనపరమైన పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుంది. ముఖ్యంగా పారిశుద్యం క్షీణించింది. వడ్డిప పంచాయతీలో ఆరు నెలలుగా పారిశుద్య పనులు చేపట్టకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీనికి తోడు డ్రైనేజీలు లేకపోవడంతో ఎక్కడికక్కడే మురుగునీరు నిలిచిపోతుంది. ప్రధాన వీధుల్లో మురుగునీరు నిలిచిపోతుండటంతో దోమల వ్యాప్తితో రోగాల బారిన పడుతున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడం, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో లేకపోవడంతో పారిశుద్యంపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది.

# వధువుకు మంగళసూత్రం అందజేత



నర్సీపట్నంః నర్సీపట్నం మున్సిపాలిటీలోని 1వ వార్డులో బుధవారం వివాహం చేసుకుంటున్న నూతన వధువు జ్యోతికి వార్డు కౌన్సిలర్ మాకిరెడ్డి విజయకుమారి, మాకిరెడ్డి అప్పారావు దంపతులు మంగళసూత్రం, పసుపు కుంకుమ, చీరను మున్సిపల్ చైర్ పర్సన్ అనిత, వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు దంపతుల చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా బిసి కాలనీ శివాలయం నుండి మేళతాళాలతో ఊరేగింపుగా వధువు ఇంటి వద్దకు వెళ్లి పసుపు కుంకుమ, చీర, సారే, మంగళ సూత్రంను అందజేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ అనిత మాట్లాడుతూ వార్డులోని ఆడపిల్లలకు వివాహం సందర్భంగా అప్పారావు దంపతులు సొంత ఖర్చులకు మంగళసూత్రాలను అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, వధువు కుటుంబీకులు పాల్గొన్నారు.

# రాజేంద్ర ప్రసాద్ వర్మకు సన్మానం



భీమునిపట్నంః భీమిలి రచయిత , కవి ప్రపంచం లో పత్రికా రంగం ఏర్పడిన దగ్గర నుంచి ఇప్పటివరకు వచ్చిన మార్పుల గురించి కవిత్వంలో రాసిన రచన ఆది నుంచి అనంతం వరకు కావ్యంలో రాసినందుకు ఈ నెల 16 న ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం లో వీసీ నాగేశ్వర రావు భీమిలి కి చెందిన పొత్తూరు రాజేంద్ర ప్రసాద్ వర్మ ను సన్మానించారు.శాలువా కప్పి మెమోంటో అందించారు. పత్రికా రంగాం పుట్టిన దగ్గర నుంచి ఎన్నో మార్పులు చైన్దిందని అన్నారు. ప్రింటింగ్ లో కూడా ఆధునికత వచ్చిందని వీటిని వర్మ కవిత్వంలో రాసారని అభినందించారు.ఈ కార్యక్రమం లో తెలుగు విభాగం అధిపతులు ఆచార్యులు పాల్గొన్నారు పత్రికా విలేకరి కవి అయితే ఇటువంటి వి రాయగలరని అన్నారు.అనంతరం వర్మ రూపొందిస్తున్న రాజహంస మాసపత్రికను ఆవిష్కరించి మొదటి ప్రతిని వీసీ వర్మకు అందజేశారు. ఈ కార్యక్రమము లో బుద్ధరాజు శివాజీ.నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# 28న జిల్లా స్థాయి వ్యాస రచన పోటీలు

భీమునిపట్నంః విజయనగరం రాజా డాక్టర్ పూసపాటి విజయరామగజపతిరాజు 95 వ జయంతి పురస్కరించు కొని విశాఖ జిల్లా స్థాయి వ్యాస రచన పోటీలు తెలుగు మరియు హిందీ భాషల్లో పి వీ జి రాజు జీవిత విశేషాల పై ఈ నెల 28 ఆదివారం పండిట్ నెహ్రూ నగరపాలిక ఉన్నత పాటశాల లో ఉదయం పదకొండు గంటల నుండి పన్నెండు గంటల వరకూ జరుగు తాదని అదర్శ్ హిందీ ప్రేమీ మండలి ఆద్వర్యంలో జరుగుతాదని అద్యక్షులు కె ఎస్ ఆర్ క ృష్ణారావు తెలిపారు.

# మత్స్యకారుల నిషేధభృతికి వివరాల సేకరణ



భీముని పట్నంః మత్స్యకారుల వేట నిషేధ సమయంలో సముద్రం పై వేటకు వెళ్లే మత్స్యకారులకు ప్రభుత్వం నుండి నిషేధ భృతి చెల్లించుటకు గాను భీమిలి డివిజన్‌లో ఉన్న బోయవీధి, ఎగువపేట మరియు తోటవీధి మత్స్యకారుల యొక్క బోటు వివరాలు, మత్స్యకారుల యొక్క వివరాలు సమకూర్చుటకు గాను మత్స్యశాఖ సూపరెంటెండెంట్ రామకృష్ణ, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి నాగమణిల పర్యవేక్షణలో జరిగింది. ఈ సంధర్బంగా అధికారులకు తెలుగుదేశం పార్టీ భీమిలి డివిజన్ అద్యక్షులు మత్స్యకారుల నాయకులు గంటా నూకరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఏప్రిల్ 15 నుండి జూన్ 15వరకు రెండు నెలలు పాటు ప్రభుత్వం వేట నిషేధం చేయడమైనది. ఈ సమయంలో చేపల ఉత్పత్తి పెరుగుతుందని, గుడ్లు పెట్టె దిశలో వేట చేస్తే మత్స్య సంపదకు అపారమైన నష్టం జరుగుతుందని చె ప్పారు. ఇలాంటి సమయంలో వేట చేయడం ద్వారా గుడ్డు దశలోనే సీడ్స్‌ను చంపడం వలన మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటుందని గంటా నూకరాజు తెలియజేసారు

అందువలన ప్రభుత్వం వేట నిషేధ సమయంలో జీవన భృతి చెల్లించడం చాలా మంచిదని ప్రభుత్వం మత్స్యకారుల కోసం అనేక.సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుందని అన్నారు

ఈ కార్యక్రమంలో మత్స్యకారుల నాయకులు కాసరపు నాగరాజు, కాసరపు ఎల్లాజి, వాడమొదలు సత్యారావు, బోయవీధి సొసైటీ ప్రెసిడెంట్ కాసరపు నర్సింగరావు, తోటవీధి, ఎగువపేట అద్యక్షులు నొల్లి రమణ, పైడిపల్లి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ అందుబాటులో లేక ఇక్కట్లు

గొలుగొండః నెల రోజులుగా తహశీల్దార్ కార్యాలయంలో ప్రజలకు, విద్యార్థులకు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు, ఇతర రెవెన్యూ కార్యకలాపాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తహశీల్దార్ నెల రోజుల పాటు రెవెన్యూపరమైన సమస్యలపై దృష్టిసారించలేదని పలు అవసరాలకు కార్యాలయానికి వచ్చే ప్రజలు వాపోయారు. అలాగే ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ పూర్తయినా ఈవీఎంలు భద్రతా కార్యాలయానికి సూపర్‌వైజర్‌గా గొలుగొండ తహశీల్దార్‌ను నియమించారు. దీంతో వచ్చే నెల 25వ తేదీ వరకూ విశాఖపట్నం ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ వద్ద విధులు నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాల జారీ చేసినట్టు తహశీల్దార్ చలమయ్య తెలిపారు. ఎన్నికల ముగిసిన అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి తహశీల్దార్ విధులకు హాజరు కాకపోవడంతో విద్యార్థులు అవసరమగు దృవపత్రాలకు, రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నయంగా ఏర్పాట్లు చేయాలని పలు గ్రామాల ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు. తహశీల్దార్‌ను రెవెన్యూపరమైన సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టే విధంగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

# యం.యల్.సి రఘువర్మకు ఆత్మీయ అభినందన సభ

- ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా
- అన్నంపేట గ్రామాభివృద్ధికి సహకారమందిస్తా
- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ యం.యల్.సి రఘువర్మ

భీమునిపట్నంః పద్మనాభం మండలం అన్నంపేట గ్రామంలో ఉపాధ్యాయులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి, విద్యా వ్యవస్థ అభివృద్ధికి తాను నిష్పక్షపాతంగా కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ యం.యల్.సి పాకలపాటి రఘువర్మ అన్నారు. పద్మనాభం అన్నం పేట గ్రామం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. తనను నమ్మి గెలిపించిన తోటి ఉపాధ్యాయులకు న్యాయం చేస్తానన్నారు. విద్యా వ్యవస్థ లోని లోటుపాట్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే అన్నంపేట గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామన్నారు. ఇటీవల తాను పనిచేసిన ఉపాధ్యాయ పదవికి స్వచ్ఛంద పదవీవిరమణ చేసిన ఆయన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ మీజ ఎన్నికలలో పోటీచేసి గెలుపొందారు.ఈ నేపథ్యంలో గ్రామస్థులు, తోటి ఉపాధ్యాయులు ఆయన కొరకు ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆయన రాకతో గ్రామస్థులు, విద్యార్థులు ఆయనకు స్వాగతం పలికారు.

### బాలికపై వృద్ధుని అత్యాచారం

భీమునిపట్నంః ఆరేళ్ళ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని భీమిలీ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. భీమిలీ పోలీసులు ఇచ్చిన వివరాలు ప్రకారం చిట్టివలసలో స్థానికంగా నివాసం ఉంటున్న ఆరేళ్ల బాలికపై పక్క ఇంట్లో ఉంటున్న కనకల బాబురావు (69) అసభ్యంగా ప్రవర్తించాడు. దానితో బాలిక తన కుటుంబ సభ్యులతో ఈ విషయం తెలిపింది. బాలిక కుటుంబ సభ్యులు భీమిలీ పోలీసులకు పిర్యాదు చేసారు. పోలిసులు అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# రంగ సాయి సేవా పురస్కారాలు ప్రదానం

- నాటక రంగాన్ని బ్రతికించుకోవాలి
- మేకప్, స్టేజ్ లైట్, సంగీత రంగాలలో ప్రముఖులకు సన్మానం

డాబాగార్డెన్స్: ప్రముఖ సామాజిక సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగు నాటకరంగ దినోత్సవ వేడుకలను విశాఖకు చెందిన రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ద్వారక నగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా రంగస్థలానికి విశేష సేవలందించిన ముగ్గురు రంగస్థల ప్రముఖులకు రంగ సాయి సేవా పురస్కారాలు ప్రదానం చేయడం జరిగింది. మేకప్ రంగంలో కోసనా సూర్యారావు, స్టేజ్ లైట్ కళాకారులు నమ్మి వెంకట్రావు, సంగీతంలో అయినాడ సూర్యారావు లకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ రచయిత, సినీ నటుడు రావి కొండలరావు చేతుల మీదుగా సేవా పురస్కారాలు ప్రధానం చేశారు. అనంతరం ప్రముఖ రంగస్థల నటుడు కె. శివరామక ృష్ణ గురజాడ కన్యాశుల్కం నాటకంలోని గిరీశం ఏకపాత్రాభినయం కనువిందుగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రావి కొండల రావు మాట్లాడుతూ నాటక రంగాన్ని బ్రతికించుకోవడానికి ప్రతి ఒక్కరూ టికెట్టు కొనుగోలు చేసి నాటకాన్ని చూడాలన్నారు. నాటక రంగానికి ఎనలేని సేవలు అందిస్తున్న బాదంగిర్ సాయిని అభినందిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా విచ్చేసిన మొదటగా విజయ్ నిర్మాణ్ సంస్థ అధినేత డాక్టర్ సూరపనేని విజయ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రంగస్థల ప్రముఖులు ఎస్కే మిశ్ర, సిహెచ్. క ృష్ణ ప్రసాద్, శివ ప్రసాద్, బొట్ట వేణుగోపాలరావు, వి. నాంచారయ్య, మేడ మస్తాన్ రెడ్డి, ఎఫ్ ఎం బాబాయ్, హేమ వెంకటేశ్వరి, శివ జ్యోతి, సంధ్యా ప్రియదర్శిని, అంజలి ఘోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి సీనియర్ పాత్రికేయులు నాగబోయిన నాగేశ్వరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

# ఉపాధి కూలీ అందక ఇబ్బందులు

నర్సీపట్నంః మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి కూలీలకు బకాయిలు అందకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పథకం కింద గత ఏడాది నంబరు నెలాఖరు నుంచ ఈ ఏడాది ఏప్రిల్ రెండో వారం వరకు నర్సీపట్నం మండలంలోని తొమ్మిది పంచాయతీల్లో 3,700 మంది కూలీలకు 16వేల పని దినాలు కల్పించారు. అయితే నెలలు గడుస్తున్నప్పటికీ ఉపాధి కూలీలకు వారి ఖాతాల్లో పని చేసిన కూలీ సొమ్ము పడకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పెద్దగా వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలంతా ఉపాధి పనులపైనే ఆధారపడ్డారు. అయితే ఉపాధి కూలీ సొమ్ము కూడా సకాలంలో రాకపోవడంతో వారు ఆర్థిక భారంతో జీవనం కొనసాగిస్తున్నారు. ఎన్నికల ముందు బకాయిల కోసం ఉపాధి కూలీలు అధికారులను ప్రశ్నించగా ఎన్నికల తర్వాత నిధులు విడుదలవుతాయని తెలిపారని, కానీ ఇంకా తమ ఖాతాలకు డబ్బులు పడలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్క గ్రామంలో 12 నుంచి, ఎనిమిది, ఆరు వారాలకు సంబంధించి కూలీ డబ్బులు రావల్సి ఉంది. ఒక పక్క వ్యవసాయ పనులు లేకపోవడం మరొక పక్క చేసిన పనికి డబ్బులు రాకపోవడంతో కూలీలు అర్థాకలితో అలమటిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తమకు కూలీ డబ్బులు వేగంగా వచ్చేటట్టుగా చూడాలని పలువురు ఉపాధి కూలీలు కోరుతున్నారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే
ఆసక్తి వ్యక్తీకరణ
ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన నెం. Store/DRH/WAT/LP/2019/01, తేదీ. 04.04.2019
₹ 49,38,700/-
30.04.2019న 1500 గంటలు
530004.

# విజయభాను సంపాదకీయం

## నేతల నోళ్లకు కళ్లెం

ఎన్నికల ప్రచారంలో ఇష్టానుసారం మాట్లాడే నేతల నోళ్లకు కేంద్ర ఎన్నికల సంఘం తాళం వేసింది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, బీఎస్పీ అధినేత్రి మాయావతి, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు ఆజం ఖాన్, కేంద్ర మంత్రి మేనకా గాంధీలపై చర్యలు తీసుకున్నది. యోగీ ఆదిత్యనాథ్, ఆజంఖాన్‌లను మూడు రోజులు, మాయావతి, మేనకా గాంధీలు రెండు రోజులు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలని ఆంక్షలు విధించింది. ఎన్నికల కమిషన్ తీసుకున్న ఈ నిర్ణయం అసాధారణమైనది. రాజకీయ నాయకుల ప్రచార సరళి, వ్యవహారణ శైలి శృతి మించి ఒక్కోసారి అసభ్యకరంగా ఉంటున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం కఠిన చర్యలకు ఉపక్రమించటం ముదావహం. అసభ్య మాటలతో ప్రత్యర్థులను దూషించటం ప్రజాస్వామిక వాతావరణంలో అభ్యంతరకరం. సుప్రీంకోర్టు జోక్యంతో అయినా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలకు ఉపక్రమించి నోటి దురుసు నేతల నోళ్లకు తాళాలు వేయటం ఆహ్వానించదగ్గ పరిణామం. విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవటం ఎన్నికల సమయంలో సాధారణం. విమర్శనాస్త్రాలు రాజకీయ విధానాలు, వాగ్దానాల ఉల్లంఘనల పరిధి మేరకే పరిమితమైతే అలాంటి విమర్శలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయి. కానీ విమర్శలు వ్యక్తిగతస్థాయికి దిగజారిపోవటం, కుల,మత ప్రస్తావనలతో ఓటర్లను ప్రభావితం చేయటం, భయభ్రాంతులకు గురిచేయటం లాంటివి ప్రజాస్వామ్యానికి హానికరమైనవి. రాజ్యాంగంలోని 324వ అధికరణం ప్రకారం ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిపే అధికారం కేంద్ర ఎన్నికల సంఘానిదే. ఎన్నికల పర్యవేక్షణ, నియంత్రణ, మార్గనిర్దేశం అంతా ఈసీదే. ఈ అధికరణం ప్రకారం ఎన్నికల విషయంలో సర్వాధికారాలు ఈసీకి ఉన్నాయి. ఒక అభ్యర్థిని అనర్హుడిగా ప్రకటించటం మొదలు, పార్టీ గుర్తింపును రద్దు చేసేదాకా విస్తృతాధికారాలు ఈసీ చేతిలో ఉన్నాయి. పలానా ఉల్లంఘనలకు ఫలానా చర్యలు తీసుకోవాలని నిర్దిష్టంగా చెప్పకపోయినా విశేష అధికారాలను రాజ్యాంగకర్తలు కట్టబెట్టారు. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ నేత ఆజంఖాన్ తన ప్రత్యర్థి, నటి జయప్రదపై తీవ్ర అభ్యంతరకరంగా, అసభ్యంగా మాట్లాడారు. కేంద్రమంత్రి మేనకాగాంధీ ఓ ఎన్నికల సభలో ముస్లిం ఓటర్లు తనకు ఓట్లేసినా, వేయకపోయినా గెలుస్తా. ఆ తర్వాత వారి సమస్యలు, వారి అభివృద్ధి కావాలో వద్దో వాళ్లే తేల్చుకోవాలని బెదిరింపు మాటలు మాట్లాడారు. ముస్లింలు మహాకూటమికే ఓటేయ్యాలి, కాంగ్రెస్ కు వేయొద్దు అని మాయావతి ఓటర్లకు పిలుపునిచ్చారు. ఇక యూపీ సీఎం ఆదిత్యనాథ్ ఏకంగా భారత సైన్యాన్ని బీజేపీ సేన అని చెప్పుకోవటమే గాక, కాంగ్రెస్, ఎస్పీ, బీఎస్పీలకు అలీపై నమ్మకముంటే, మాకు బజరంగ్‌బలీపై విశ్వాసమున్నదని మెజార్టీ ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నం చేశారు. మరోవైపు రెండు జాతీయపార్టీల అగ్రనేతలుగా ఉన్న మోదీ, రాహుల్ గాంధీ ఏమీ తక్కువ తినలేదు. కాంగ్రెస్ రక్తమంతా కుంభకోణాలతోనే నిండి ఉన్నదని నరేంద్రమోదీ విమర్శిస్తుంటే, ఈ మధ్య దొంగల ఇంటి పేర్లన్నీ మోదీ అని ఉంటున్నదని రాహుల్ ప్రతివిమర్శలు చేస్తున్న తీరు అభ్యంతకరమని చెప్పక తప్పదు. జాతీయస్థాయిలో ఇలా ఉంటే రాష్ట్రాల పరిధిలో కూడా దీనికి భిన్నంగా ఏమీ లేదు. ఏపీ సీఎం చంద్రబాబు అయితే తీవ్ర అసహనానికి గురై.. తాట తీస్తా, తోలు ఒలుస్తా లాంటి మాటలు మాట్లాడారు. ఇలాంటి నోటి దురుసు వ్యవహారణను కట్టడి చేయాల్సిన అవసరాన్ని ఈసీ గుర్తించటమే కాదు, తగువిధంగా స్పందించి చర్యలకు ఉపక్రమించటం ప్రజాస్వామ్యానికి మంచి పరిణామం. రాజ్యాంగంలోని 324వ అధికరణం ప్రకారం ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిపే అధికారం కేంద్ర ఎన్నికల సంఘానిదే. ఎన్నికల పర్యవేక్షణ, నియంత్రణ, మార్గనిర్దేశం అంతా ఈసీదే. ఈ అధికరణం ప్రకారం ఎన్నికల విషయంలో సర్వాధికారాలు ఈసీకి ఉన్నాయి. ఒక అభ్యర్థిని అనర్హుడిగా ప్రకటించటం మొదలు, పార్టీ గుర్తింపును రద్దు చేసేదాకా విస్తృతాధికారా లు ఈసీ చేతిలో ఉన్నాయి. పలానా ఉల్లంఘనలకు ఫలానా చర్యలు తీసుకోవాలని నిర్దిష్టంగా చెప్పకపో యినా విశేష అధికారాలను రాజ్యాంగకర్తలు కట్టబెట్టారు. ఈ అధికారాలతోనే రెండున్నర దశాబ్దాల క్రితమే చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా శేషన్ ఎన్నికల వ్యవస్థలో సంచలనాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. మరో మాటలో చెప్పాలంటే ఎన్నికల కమిషన్ అనేది ఒకటున్నదని దేశ ప్రజలకు తెలియజెప్పారు. ఎన్నికల ప్రచారం, నిర్వహణలో అవకతవకలు చోటు చేసుకున్నాయని పోలింగ్‌కు కొన్ని గంటల ముందే పంజాబ్‌లో ఎన్నికలనే రద్దు చేశారు. హిమాచల్‌ప్రదేశ్‌లో గవర్నర్‌గా పనిచేస్తున్న గుల్షర్ అహ్మద్ మధ్యప్రదేశ్‌లో పోటీ చేస్తున్న తన కుమారుడికి ప్రచారం చేసి సింహ స్వప్నంగా నిలిచారు.

## మునుపెన్నడూ ఇలాంటి ప్రధాని లేరు : మమత



కోల్‌కతా : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిపక్షాలను బెదిరిస్తున్నారని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ ఆరోపించారు. బుధవారం ఆమె పశ్చిమ బెంగాల్‌లోని కందిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ డీఎంకే నేత కనిమొళి నివాసంపై కేంద్ర ప్రభుత్వ సంస్థలు నిర్వహించిన సోదాలను ప్రస్తావించారు. బీజేపీని డీఎంకే వ్యతిరేకిస్తోంది కాబట్టే కనిమొళిని వేధిస్తున్నారని మమత అన్నారు. దక్షిణాదిలో బీజేపీ విభజన రాజకీయాలను డీఎంకే వ్యతిరేకిస్తోందన్నారు. ప్రతివాళ్ళూ భయపడేవిధంగా పరిపాలించే ప్రధాన మంత్రిని మునుపెన్నడూ చూడలేదన్నారు. ప్రేమాదరాలను పొందడానికి బదులుగా భయపెడుతున్నారన్నారు. ప్రతిపక్షాలను వేధించడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థలను వాడుకోవడం బీజేపీకి సిగ్గు చేటు అన్నారు.

ఎన్నికల అధికారులు, ఆదాయపు పన్ను శాఖ అధికారులు మంగళవారం తమిళనాడులోని ట్యుటికొరిన్‌లో కనిమొళి నివాసంలో సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే.

## బీజేపీలో చేరిన సాధ్వి ప్రగ్యా సింగ్ ఠాకూర్

భోపాల్ : మాలేగావ్ పేలుళ్ల నిందితురాలు సాధ్వి ప్రగ్యా సింగ్ ఠాకూర్ భారతీయ జనతా పార్టీలో బుధవారంనాడు చేరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, తాను ఎన్నికల్లో పోటీ చేసి గెలుస్తానని చెప్పారు. ప్రస్తుతానికైతే ఆమెకు బీజేపీ టిక్కెట్ కేటాయించనప్పటికీ భోపాల్ నుంచి కాంగ్రెస్ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్‌పై ఆమెను పోటీకి దించవచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

సాధ్వి ప్రగ్యా సింగ్ బీజేపీలో చేరడానికి ముందు పార్టీ సీనియర్ నేతలు శివరాజ్ సింగ్ చౌహాన్, రామ్‌లాల్, అనిల్ జైన్, నరోత్తమ్ మిశ్రా, ప్రభాత్ ఝా తదితరులను పార్టీ ప్రధాన కార్యాలయంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, దేశానికి వ్యతిరేకంగా కుట్ర చేస్తున్న వారిపై కలిసికట్టుగా పోరాటం సాగిస్తామని, ఈ ధర్మయుద్ధంలో తాము గెలుస్తామని అన్నారు. 'కాంగ్రెస్ కుట్ర వల్ల పదేళ్లు జైలులో గడిపాను. రాజకీయ, మతపరమైన యుద్ధంలో పోరాడేందుకు నేను ఇక్కడకు వచ్చాను' అని చెప్పారు. మహారాష్ట్రలోని మాలేగావ్‌లో 2008 సెప్టెంబర్ 29న జరిగిన బాంబు పేలుడు ఘటనలో ఆరుగురు మృతి చెందగా, డజను మంది వరకూ గాయపడ్డారు. కాగా, మధ్యప్రదేశ్‌లో చివరి నాలుగు విడతల్లో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరుగనుంది.

## నమో టీవీకి ఈసీ భారీ షాక్

న్యూఢిల్లీ : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నడుస్తున్న నమో టీవీ ప్రసారాలపై ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించింది. నిబంధనల ప్రకారం లోక్‌సభ ఎన్నికల ప్రచార గడువును పాటించాలని స్పష్టం చేసింది. ఏడు దశల్లో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో మిగిలిన ఆరు దశల్లోనూ నిర్దేశిత రీతిలో ప్రతి దశ పోలింగ్‌కు ముందు 48 గంటలపాటు ఎన్నికలకు సంబంధించిన రాజకీయ అంశాలను ప్రసారం చేయరాదని వివరించింది. ఈ ఆదేశాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని ఢిల్లీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌ను ఆదేశించింది. ఢిల్లీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ టీవీ ఛానళ్ళు, ఇతర మాధ్యమాలలో ప్రసారమయ్యే రాజకీయ అంశాలను ముందుగా ధ్రువీకరించే నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. పోలింగ్ తేదీకి ముందు 48 గంటలపాటు ఎన్నికల సంబంధిత




రాజకీయ అంశాలను సినిమాటోగ్రాఫ్, టెలివిజన్, ఇతర సాధనాల ద్వారా ప్రసారం చేయరాదని చట్టం చెప్తోంది. అయితే ప్రింట్ మీడియాకు ఈ నిబంధనలు వర్తించవు.

## ధర్నాకు యత్నిస్తే గృహనిర్బంధమా? : ఉత్తమ్

హైదరాబాద్: రాష్ట్రంలో పోలీసులు అత్యుత్సాహంగా ప్రవర్తిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ధర్నాకు ప్రయత్నిస్తే నిర్బంధం చేయడం దారుణమన్నారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఇంటికి కొందరు పోలీసులు వచ్చి ఆయన పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. తెరాస రాజకీయ కక్షలకు పాల్పడుతోందని, అక్రమంగా కేసులు పెట్టడంపై న్యాయపరంగా ఎదుర్కొంటామన్నారు. విశ్వేశ్వర్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అంబేద్కర్ విగ్రహ కూల్చివేత ఘటనను జాతీయ స్థాయిలో లేవనెత్తుతామన్నారు. మందకృష్ణకు సంఘీభావం తెలుపుతున్నట్లు ఉత్తమ్ తెలిపారు.

## ఇది ఎయిర్‌లైన్ కర్మ

లండన్: ఫ్యుజిటివ్ వ్యాపారవేత్త, విజయ్ మాల్యా(63) మరోసారి కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. జెట్ ఎయిర్ వేస్ సంక్షోభానికి కేంద్రమే కారణమని ఆరోపించారు. ఈ సందర్భంగా రుణ సంక్షోభంలో కూరుకుపోయి మూసివేత దిశగా పయనిస్తున్న విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్ పట్ల తన విచారం వ్యక్తంచేశారు. ముఖ్యంగా జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేష్ గోయల్, నీతా గోయల్‌కు తన సానుభూతిని ప్రకటించారు. ఒకప్పుడు కింగ్‌ఫిషర్‌కు జెట్ ఎయిర్‌వేస్ గట్టి పోటీ ఇచ్చింది. అంత పెద్ద ప్రయివేటు ఎయిర్‌లైన్‌ను ఈ స్థితిలో చూడాల్సి రావడం బాధాకరమంటూ విజయ్ మల్యా బుధవారం ట్వీట్ చేశారు.

జెట్ పరిస్థితికి ప్రభుత్వమే కారణమంటూ ట్విటర్ వేదికగా ఆరోపణలు చేశారు. ఒక పక్క ఎయిరిండియాను భారీ ప్యాకేజీ (రూ.35వేల కోట్లు)తో ఆదుకున్న ప్రభుత్వం ప్రయివేటు సంస్థలపై మాత్రం వివక్ష చూపిస్తోందని ఆరోపించారు.

వ్యాపార పరంగా తాము ప్రత్యర్థులమే అయినప్పటికీ జెట్ ఎయిర్‌వేస్ కోసం ఎంతో కష్టపడ్డ గోయల్ దంపతులకు సానుభూతి. వారి సేవలకు నిజంగా దేశం గర్వపడాలి. కానీ దురదృష్టవశాత్తూ దేశీయంగా చాలా ఎయిర్‌లైన్స్ దెబ్బతింటున్నాయి. ఎందుకు అని మాల్యా ప్రశ్నించారు.

అలాగే తాను బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు 100శాతం తిరిగి చెల్లిస్తానని చెబుతున్నానని, కానీ బ్యాంకులే తీసుకోవడం లేదంటూ మాల్యా మరోసారి ట్విటర్ వేదికగా తన గోడును వెళ్లబోసుకున్నారు. 100శాతం చెల్లిస్తానన్నా నాపై నేర అభియోగాలు వేస్తున్నారు. ఇది ఎయిర్‌లైన్ కర్ మఅన్నారు. దీంతోపాటు లండన్‌లో ఉన్నా జైల్లో బ్యాంకులను బకాయిలు చెల్లిస్తానని మరోసారి హామీ ఇచ్చారు.

## సమయం (కవి సమయం)

### జీవితం

వర్తమానంలో జీవిస్తూ
భవిష్యత్తుకు పునాదులు వేసుకుంటూ
ఆశావహ దృక్పథంతో సాగడం ఆవశ్యం
ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు
ప్రణాళికలు, కార్యాచరణ, పట్టుదల,
క్రమశిక్షణ, ముందుచూపు అత్యావశ్యకం
మనోభావాలలో చైతన్యం
ఆలోచనలలో నూతనత్వం
ప్రవర్తనలో దివ్యత్వం
సంబంధిత రీతిలో ఆదర్శవంతమైన
నూతన నిర్ణయాల రూపకల్పన
భిన్నత్వంలో ఏకత్వం
జాతీయ సమగ్రత, సర్వజీవ సమానత్వం
ఉల్లాస, ఆనందభరితమైన జీవితం
అందరి లక్ష్యం, గమ్యం, ఆశయం

...కవితా రచన
సి.ప్రతాప్
సెల్ నెం: 90636 22665

## పంచాంగం

మాసం : చైత్ర , తిథి : చతుర్ధశి సా.6.50; హస్త రా.9.05; ఉ.వ.6.20ల 7.51; తె.వ.4.43ల

గురువారం 18-04-2019

**మేషం** : రాజకీయాల్లోని వారికి శత్రువులు అధికమవుతున్నారని గమనించండి. బంధువుల రాక కొంత అసౌకర్యం కలిగిస్తుంది. ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించి అగ్రిమెంట్లు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. వాహనం ఇతరులకు ఇచ్చే విషయంలో లౌక్యంగా వ్యవహరించండి. బంధువుల రాక కొంత అసౌకర్యం కలిగిస్తుంది. **వృషభం** :కుటుంబ విషయాలపై దృష్టి సారిస్తారు. మీ యత్నాలు గుంభనంగా సాగించాలి. ఇంటా ఒయటా మీ మాట చెల్లుబాటు కాగలదు. కొబ్బరి, పండ్లు, పువ్వులు, చిరు వ్యాపారులకు లాభ దాయకంగా ఉంటుంది. ఓర్పుతో సర్దుకు పోవటానికి యత్నించండి. బంధువులు, సోదరుల మధ్య ఆత్మీయతలు నెలకొంటారు. **మిధునం** : బ్యాంకు డిపాజిట్లు దీర్ఘకాలిక పెట్టుబడులు అనుకూలం. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. స్థిరచరాస్తుల విషయంలో ఒక నిర్ణయానికి వస్తారు. కిట్టని వారు మిమ్ములను తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తారు. విద్యార్థినులకు ప్రేమ వ్యవహారాల్లో చుక్కెదు రవుతుంది. **కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, వ్యవహార ఒప్పందాల్లో జాగ్రత్త అవసరం. పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. బంధువులతో తగాదాలు ఒత్తిడి తప్పవు. ఒక స్థిరాస్తి కొనుగోలుకు అడ్డంకులు తొలగిపోగలవు. వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం. **సింహం** : తలపెట్టిన కార్యక్రమాలు ఆలస్యంగా సాగుతాయి. ఉద్యోగస్థులు సమర్థవంతంగా పనిచేసి అధికారులను మెప్పిస్తారు. విద్యార్థులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవహారాలు మీరు కోరుకున్నట్లుగానే వాయిదా పడతాయి. నిరుద్యోగులు వచ్చిన అవకాశాన్ని తక్షణం వినియోగించుకోవాలి. **కన్య** : పెద్దలుగా మీ బాధ్యతలు నిర్వహిస్తారు. సభలు, సమావేశాల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. ఎప్పటి నుంచి వాయిదా పడుతున్న పనులు పునఃప్రారంభ మవుతాయి. హామీలు, చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి. ఉద్యోగ రీత్యాదూర ప్రయాణాలు వాయిదా వేయాల్సి వస్తుంది. **తుల** : కళల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఇచ్చిపుచ్చుకొనే వ్యవహారాలు, రిజిస్ట్రేషన్లు అనుకూలిస్తాయి. ఉద్యోగస్తులకు బరువు బాధ్యతలు అధికం కావడంతో శ్రమాధిక్యత తప్పదు. ఆలయ సందర్శనాల్లో ఇబ్బందులు తప్పవు. ఏకాంతం కోసం చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు స్వీయ ఆర్జన పట్ల ఆసక్తి, తగు ప్రోత్సాహం లభిస్తుంది. **వృశ్చికం** : ఆర్థిక విషయాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తారు. ఉపాధ్యాయులకు, మార్కెటింగ్ రంగాల వారికి ఒత్తిడి అధికమవుతుంది. కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు వాయిదా పడుతున్న పనులు పునః ప్రారంభం కాగ లవు. మీ సమర్థత, నిజాయితీలకు ప్రభు త్వము నుంచి మంచి గుర్తిపు, రాణింపు లభిస్తుంది. **ధనుస్సు** : వ్యాపారాల్లో ఆటుపోట్లను ధైర్యం ఎదు ర్కొని లాభాల బాటలో నడిపిస్తారు. పలుకుబడి కలిగిన వ్యక్తుల సహకారం లభిస్తుంది. విద్యార్థులకు వేడుకలకు వేడుకలలో హడావుడి, చురుకుతనం అధికమవుతాయి. వైద్యులకు శస్త్ర చికిత్సల సమ యంలో ఓర్పు, ఏకాగ్రత చాలా ముఖ్యం. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుంది. **మకరం** : దైవ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని అందరినీ ఆకట్టు కుంటారు. విద్యార్థులు బజారు తినుబండారాలు భుజించడం వల్ల అస్వస్థతకు లోనవుతారు. భార్యాభర్తల మధ్య అవగాహనా లోపం వల్ల సమస్యలు తలెత్తుతాయి. మీ కళత్ర మొండి వైఖరి మీకు ఎంతో ఆందోళన కలిగిస్తుంది. **కుంభం** : కొబ్బరి, పండ్లు, పూల వ్యాపారులకు లాభ దాయకంగా ఉంటుంది. శత్రువుల సైతం ఆకట్టుకుని ముందుకు సాగుతారు. దూర ప్రయా ణాల్లో వస్తువుల పట్ల మెళకువ అవసరం. రావలసిన బకాయిలు సకాలంలో అందిన ధనం ఏమాత్రం నిల్వ చేయలేరు. గృహో పకరణాలు కొనుగోలు చేస్తారు. **మీనం** :దైవ పుణ్య కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తిని ఇస్తాయి. రుణాలు తీర్చడానికి చేయు యత్నాలు వాయిదా పడతాయి.

# బాబాను దర్శించిన యోగులు



శ్రీ స్వామి వామదేవ మహరాజ్

భగవాన్ బాబా నరనారాయణ గుహకు పంపిన 11మంది అదృష్టవంతులైన సాధకులలో ఈ 106 సంవత్సరాల అవధూత వామదేవ మహరాజ్ ఒకరు.

శ్రీ కాక భుశుండి అవధూత

భగవాన్ బాబా పదకొండు మంది సాధకులను ఎంపిక చేసి, వారికి ప్రత్యేకమైన ఆశీస్సులతో పాటు, వారికి నిత్యము ఆహారం సమకూర్చే ఒక అక్షయపాత్రను ప్రసాదించి, హిమాలయాలలో బదరీనాథ్‌కు 25 మైళ్ళ దూరంలో వాయవ్యదిశలో నరనారాయణ పర్వతం మీద ఊర్వశీకుండ్ సమీపంలో ఒక నివాస యోగ్యమైన గుహలో తాపస జీవతం గడపమని పంపారు. భగవాన్‌బాబా అప్పుడప్పుడు ఆ గుహ ఆశ్రమంలో ప్రత్యక్షమై వారికి సాధనలో వచ్చిన సంశయాలను నివృత్తి చేస్తూ ఉన్నారు. సుమారు ఐదువందలు లేక వేయి సంవత్సరాల ఆయుష్షు కలిగిన మహా సిద్ధ పురుషులు అప్పుడప్పుడు ఈ నరనారాయణ గుహాశ్రమానికి వచ్చి వారితో బాబా గురించి సంభాషించి, అక్షయపాత్రలో బాబా సృష్టించిన ప్రసాదం స్వీకరించి వెళుతుండేవారు. అటువంటి సిద్ధపురుషులలో 1.కాక భుశుండి అవధూత 2. మరొక వేదాంత పరివ్రాజక సిద్ధపురుషుడు 3. మహావతారబాబా 4. బాబా సుందరదాస్ 5. దేవరియా బాబా. 6. భృగుబాబా వంటివారు కొందరు భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి దివ్యత్వం గుర్తించిన మహానుభావులు. కాక భుశుండి అవధూత అనేది వీరిపేరు కాదు. ఈ సిద్ధ పురుషుడు హిమాలయాలలో కాక భుశుండి పర్వతం మీద నివసిస్తున్నారని నరనారాయణ గుహలోని మన ఆశ్రమవాసులు వారిని అలా భావన చేశారు. వీరు మొదటిసారి నరనారాయణ గుహకు వచ్చినప్పుడు ఆశ్రమవాసులు 'అయ్యా! శివావతారమైన శ్రీ సత్యసాయినాథ భగవానుని గురించి మీ అభిప్రాయం తెలుసుకొనవచ్చునా?" అని అడిగారు. అప్పుడు ఆయన భగవద్గీత విభూతియోగంలోని

నమే విదుః సురగణాః ప్రభవం న మహర్షయః!
అహమాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశష!

అనే శ్లోకం చెప్పి కృష్ణుడు అర్జునునితో 'అర్జునా! నా అవతార రహస్యమును దేవతలు ఏఋుగురు. ఋషులూ ఎఋుగరు. కారణమేమంటే దేవతలు మరియు మహర్షులకు నేను కారణభూతుడను, ఆదికర్తను!' అన్నాడు. ఇలా చెప్తూ ఆ అవధూత 'దివ్యస్థితి కలిగి, మంత్ర సాక్షాత్కారము చేసుకొనే మహర్షులు కూడా అవతారతత్త్వాన్ని గుర్తించలేనప్పుడు నావంటి సాధారణమైన వ్యక్తి వారిని ఎలా తెలుసుకోగలగుతాడు?' అని పలికారు. మరికొన్ని రోజులు గడిచాక ఒకసారి బాబావారి గురించి సంభాషణ వచ్చినప్పుడు కాక భుశుండి అవధూత 'అవతారమూర్తియైన భగవంతుని దర్శనం చేసుకొని వారి అనుగ్రహాన్ని పొందుతున్న మీరు అత్యంత అదృష్టవంతులు. కాని అవతారమూర్తి మమ్మల్ని దగ్గరకు రానీయటంలేదు. ఇటువంటి స్థితిలో వారి ఆశీర్వాదం లభించటం మాకు అసాధ్యంగా ఉంది' అన్నారు. ఈ సిద్ధ పురుషుని మాటలను బట్టి వీరు సాయినాథుణ్ణి అవతారమూర్తిగా స్వీకరించారని, వారి అను గ్రహం కోసం తపన చెందుతున్నారని స్పష్టమవుతున్నది.

## సంకీర్తన

శ్రీ వేదాంత పరివ్రాజక సిద్ధ పురుషుడు

ఈ మహాపురుషుని పేరు అడిగే సాహసం ఆశ్రమ వాసులెవ్వరూ చేయలేదు. ఈ మహనీయుడు నరనారాయణ గుహకు వచ్చి ఆధ్యాత్మిక సంభాషణ చేస్తున్నప్పుడు బాబా పంపిన ఆశ్రమవాసులు వారితో మెల్లగా తాము సత్యసాయి బాబావారు పంపగా వచ్చిన సాధకులమని, ఆ విశేషాలు వివరించి చెప్పినప్పుడు ఆ సిద్ధ పురుషుడు వారితో 'అవును, శివుడు సత్యసాయిబాబా రూపంలో అవతారం దాల్చడు! కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఆయన మావంటి సిద్ధ పురుషుల్ని దగ్గరకు రానీయటం లేదు' అన్నారు.

ఆ మహ నీయుని మాటల్లో కూడా బాబాను పరమ శివుని అవతారంగా అంగీకరించినట్లు స్పష్టంగా తెలుస్తున్నది.

...సశేషం



బాబ్జి

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

ప్లాట్లు అమ్మకంనకు గలవు
సబ్బవరం మండలంలో ఆరిపాక మెయిన్‌రోడ్డులో 22 సెంట్లు, 190 చ॥గ॥, 173 చ॥గ॥ ఇల్లు వుడా ప్లాట్లు మరియు పంచాయితీ ప్లాట్లు అమ్మకంనకు కలవు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 9866955823; 8247641310

## గొందిగూడ గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న గిరిజనులు

అనంతగిరి : అరకులోయ నియోజకవర్గం, నియోజకవర్గం లోని డుంబ్రిగుడ మండలం, కొర్రా పంచాయతీ, గొందిగుడ గ్రామంలో 30 మంది గిరిజనులు జ్వరాలతో బాధపడుతున్నారు.ఇంతవరకు వైద్యాధికారులు ఎవ్వరూ జ్వరబాధితులను చూడలేదు, సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యుడు కీల్లోసురేంద్ర ఈరోజు ఉదయం గ్రామాన్ని సందర్శించి పరామర్శించడమైనది.జ్వరభాదితులకు తక్షణమే వైద్యసదుపాయం కల్పించాలని, పాడేరు ఐటిడిఎ ప్రోజెక్టు అధికారి శ్రీ డీకే భాలజి గార్కి పిర్యాదు చెయ్యడమైనది. గతవారం నుండి గ్రామంలో జ్వరం,తలనొప్పి, జలుబు,దగ్గు, వొళ్లు నొప్పితో గిరిజనులు తీవ్రమైన బాధపడుతున్నారు. గ్రామంలో పరిశుభ్రత పాటించి గిరిజనుల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరడం జరిగింది.

## దేవస్థానం పర్యవేక్షక ఇంజనీర్‌గా నూకరత్నం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం దేవస్థానంలో ఇంజనీరింగ్ విభాగంలో డిప్యూటీ పర్యవేక్షక ఇంజనీర్ (డీఈఈ) గా పనిచేస్తున్న నూకరత్నాన్ని పర్యవేక్షక ఇంజనీర్ గా పదోన్నతి కల్పిస్తూ దేవదాయ శాఖ కమీషనర్ ఆదేశాలు జారీ చేశారు.గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ప్రకారం ఇంజనీరింగ్ విభాగంలో ఈఈ గా పనిచేస్తున్న నూకరత్నం సాంకేతిక విద్యార్హతలు పరిశీలించి తదనుగుణంగా పర్యవేక్షక ఇంజనీర్ (ఈఈ ) పదోన్నతి రద్దు చేస్తూ డిప్యుటీ పర్యవేక్షక ఇంజనీరుగా (డీఈఈ )గా నియమించడం జరిగింది. ప్రస్తుతం తిరిగి డిప్యూటీ పర్యవేక్షక ఇంజనీర్ నుండి పర్యవేక్షక ఇంజనీర్ గా దేవదాయ శాఖ కమీషనర్ తిరిగి పదోన్నతి కల్పించారు.ఆ ఉత్తర్వుల ప్రకారం కార్య నిర్వహణాధికారి ఎం.వి.సురేషబాబు దేవస్థానం పర్యవేక్షక ఇంజనీరుగా (ఈఈ) గా నూకరత్నాన్ని నియమిస్తూ తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

## పైడితల్లి అమ్మవారి ఆలయం 4లక్షల 09వేల 857

విజయనగరం : ఉత్తరాంధ్ర కల్పవల్లి శ్రీశ్రీశ్రీపైడితల్లి అమ్మవారి ఆలయం (వనంగుడి) హుండీల లెక్కింపు బుధవారం జరిగింది. 4లక్షల 09వేల 857 రూపాయలు, 13 గ్రాముల బంగారం, 112 గ్రాముల వెండి వచ్చిందని దేవస్థానం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సూపర్‌వైజర్ అప్పలనాయుడు, ట్రస్ట్ సభ్యులు గొల్లకోటి గురున్నాధరావు, బలివాడ అప్పారావు, విజ్జపు శంకరరావు పాల్గొన్నారు.

## ఉపాధిపొందే విధంగా పాఠ్యప్రణాళిక

ఎచ్చెర్ల : అంబేడ్కర్‌విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తోన్న పీజీ కోర్సులకు సంబంధించిన పాఠ్యప్రణాళికలో కొన్ని మార్పులు చేస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య డా.కూన రామ్‌జీ అన్నారు. స్థానిక వర్సిటీలో మంగళవారం ఆంగ్లం, జర్నలిజం విభాగాల ఆచార్యులతో ఆయన సమావేశమయ్యారు. ఉపాధి అవకాశాలకు అనుగుణంగా పాఠ్యప్రణాళిక ఏర్పాటు చేయాలని కనీసం 30శాతం ప్రస్తుతం మార్పులు చేయాలని వారికి సూచించారు. పాఠ్యప్రణాళికలోని లోపాలను సవరించుకోవాలని ఆయన అన్నారు. విద్యార్థుల ప్రయోజనాలకు ద ృష్టిలో ఉంచుకొని పాఠ్యప్రణాళిక ఉండాలన్నారు. వీటితోపాటు సంబంధిత కోర్సులను ఉపాది అవకాశాల లభించే విధంగా ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. త్వరలో వర్సిటీకి నాక్, వర్సిటీ నిధులు మంజూరు సంస్థ గుర్తింపు కోసం ఇక్కడికి రానున్న నేపథ్యంలో చేయాలనుకుంటున్నారు.

**పేరు మార్పు**

**నా పేరు రేణుక సాహూ (పాతపేరు)**
**భర్త పేరు సునీల్‌కుమార్ సాహూ**
**రెసిడెంట్ ఆఫ్ :**
**39-03-11/3, ఎఫ్.నెం.301,**
**ఐశ్వర్య ఫ్లోరా,**
**మసీదు ఎదురుగా, మురళీనగర్,**
**విశాఖపట్నం.**
**ఇప్పుడు నా యొక్క పేరు రేణుక శివంగి (కొత్తపేరు)గా మార్చడమైనది.**

**In the Hon'ble Court of the IV th Addl. District Judge at Visakhapatnam.**
**MOP 455/2018**
**Between :-**
**S. Pydiraju & others ...Petitioners**
**And,**
**I.Venkateswar rao & others ...Respondents**

**NOTICE**

**R-1**
**I.Venkateswar Rao**
**S/o.Laxminarayana,**
**D.No.36-20-11, Yellaballivari Street**
**Kancharapalem, Visakhapatnam.**

పై నెంబరు కేసును మోటారు యాక్సిడెంటునందు సిరికి నరసింగరావు చనిపోయిన కారణంగా వారి వారసులు నష్టపరిహారం నిమిత్తం **(రూ.28,00,000/-లు)** సదరు కేసును దాఖలు చెయ్యగా, సదరు కేసు నందు R1 అయిన మీకు ఎన్నిసార్లు కోర్టు ద్వారా మరియు పోస్టు ద్వారా మీకు నోటీసులు జారీ చేసిననూ మీకు చేరని కారణంగా యీ పేపరు ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తం **తే.29-04-2019దీని** వాయిదా అయి ఉన్నది. కావున, **తే.29-04-2019దీన ఉ.10.30 ని॥లకు** పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెల్పగలరు. లేనిచో సదరు కేసును మీ పరోక్షమందు తీర్మానించడమగును.

**(By Court Order)**

**N.Vijaya Kumar**
**Advocate**
**Visakhapatnam**
**Cell : 9912707565**

Visakhapatnam
Dt: 15-04-2019

## గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను ఆరు నెలల్లో నిర్వహించాలి : కె.గోపాల్‌రెడ్డి



విలేకర్లతో మాట్లాడుతున్న కె.గోపాల్‌రెడ్డి

విశాఖపట్నం: గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను ఆరు నెలల్లో నిర్వహించాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం హర్షణీయమని 31వ వార్డు తాటిచెట్లపాలెం నివాసి, సామాజిక కార్యకర్త కె గోపాల్‌రెడ్డి అన్నారు. వీజేఎఫ్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2012లో జీవీఎంసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా ప్రభుత్వం నేటికీ ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తోం దన్నారు. దీంతో 2017లో తాను హైకోర్టులో ఫిల్ దాఖలు చేశానని తెలిపారు. అప్పటి నుంచి నేటి వరకు హైకోర్టులో అనేక వాదోపవాదనలు జరిగాయన్నారు. ఆరు సంవత్సరాలుగా జీవీఎంసీ ఎన్నికలు జరగక పోవడానికి వివిధ పార్టీల్లో ఉన్న ప్రజాప్రతినిధులే కారణమని కోర్టుకు తెలిపానన్నారు. అంతే కాకుండా పాలన గాడితప్పిందని, ప్రజలు సమ స్యలు పరి ష్కారం కాక అవస్థలు పడుతున్నారని కోర్టుకు విన్నవించానన్నారు. అంతేకాకుండా పలు కారణాలను పరిగణలోకి తీసుకుని జీవీఎంసీ ఎన్నికలు ఆరు నెలల్లో నిర్వహించాలని ఈ నెల 1వ తేదీన హైకోర్టు తీర్పు వెల్లడించిందని తెలిపారు.

దీనికి సంబంధించిన ప్రతులను ఆయన విలేఖరులకు చూపించారు. ఆరు నెలల్లో జీవీఎంసీ ఎన్నికలు నిర్వహించ కుంటే మళ్లీ కోర్టుకు వెళ్తానని ఆయన తెలి పారు. ఇప్పటికైనా ప్రభుత్వం త్వరితగతిన ఎన్నికలు నిర్వహించి అధికారుల పాలన నుండి నగర వాసులకు విముక్తి కల్పించి ప్రజాప్రతిధుల పాలన అందించి జీవీఎంసీ పాలన గాడిలో పెట్టాలని ఆయన కోరారు.

## కాంగ్రెస్, ఎన్‌ఆర్ కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రధాన పోటీ

యానాం : పుదుచ్చేరి పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్, ఎన్‌ఆర్ కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రధాన పోటీ నెలకొని వుంది. ఈనెల 18న జరగనున్న ఎన్నికలలో అధికారంలో వున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్ధి వి.వైధిలింగం, ఎన్.ఆర్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్ధి డా.కె.నారాయణ స్వామిల మధ్య పోటీ తీవ్రంగా వుంది. కాంగ్రెస్, డిఎంకె, సీపీఐ, పిపిఎం, ముస్లింలీగ్ పార్టీలు మద్దతు వి.వైధిలింగంకు ఇవ్వగా, ఎన్‌ఆర్ కాంగ్రెస్, అన్నా డిఎంకె, బీజేపీ, పిఎంకె పార్టీల కూటమి అభ్యర్థిగా డా.కె.నారాయణసామి పోటీలో వున్నారు. కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీ, ప్రతిపక్షంలో వున్న కాంగ్రెస్ పార్టీల మధ్య జరుగుతున్న పోటీగా ఓటర్లు భావిస్తున్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల వల్లే ఓటర్లు తమకు ఓటు వేస్తారని కాంగ్రెస్ నాయకులు ధీమాగా వున్నారు. పుదుచ్చేరి వ్యాప్తంగా ఎన్.అర్.కాంగ్రెస్ అభ్యర్ధికి ఎంతవరకు ఓట్లు వస్తాయన్నది వేచి చూడాలి. ఈ ఎన్నికలలో 4గురు అభ్యర్థులు పోటీలో వున్నారు. యానాం అసెంబ్లీ నియోజకవర్గంలో 36,562 ఓట్లు ఏ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు పోలౌతాయన్న దానిపై ఆ పార్టీ నాయకులు అంచనాలు వేసుకుంటునానరు. పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు పిలుపు మేరకు కాంగ్రెస్‌కు అత్యధికంగా ఓట్లు పోలౌతాయని ధీమాగా వున్నారు. మంత్రి మల్లాడి యానాంలో విస్తృతంగా పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఎన్.అర్ కాంగ్రెస్‌పార్టీ మద్దతుదారులు బహిరంగంగా కాంగ్రెస్‌లో కలిసిపోయారు. దీంతో గత అసెంబ్లీలో ఎన్‌ఆర్. కాంగ్రెస్‌పార్టీకి వచ్చిన ఓట్లు సగానికి సగం పడిపోతాయని అంచనాలు వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు మేలు చేకూరుతుందని భావిస్తున్నారు.

గతంలో రాజ్యసభలో 5 సభ సభ్యులు యానాం అభివృద్ధికి ఒక రూపాయి కూడా ఖర్చు చేయకుండా ఓట్లు ఎలా అడుగుతారు. ఎవరూ ఓటు వేస్తారు అనే భావన కూడా వుంది. స్థానిక ఎన్‌ఆర్.కాంగ్రెస్ నాయకులు చేసిన ఎన్నికల ప్రచారం ఎంతవరకు ఓటర్లు వస్తాయన్నది వేచిచూడాలి.

మల్లాడిపై వున్న వ్యతిరేకతకు ఎన్‌అర్.కాంగ్రెస్‌పార్టీ లాభం చేకూరదని భావిస్తున్నారు. యానాంలో అభివృద్ధికి పట్టం కడతారో, అభివృద్ధికి అడ్డుకుంటున్న వారికి ఓటు వేస్తారో జరగనున్న ఎన్నికలలో తేలనున్నది.

## రోడ్లపై చెత్తవేస్తే జరీమానా తప్పదు: మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.దీపక్

విజయనగరం : రోడ్లపై చెత్త వేస్తే జరీమానా తప్పదని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.దీపక్ హెచ్చరించారు. పట్టణంలో పారిశుద్ధ్యం తనిఖీల్లో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఐనాక్స్ వద్ద రోడ్డుపై వ్యాపారం చేస్తున్న పండ్ల వ్యాపారులతో అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌ఓ డా.దీపక్ మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో రోడ్లను సుందరంగా తయారు చేస్తుంటే, రోడ్ల ప్రక్కన వ్యాపారం చేస్తూ వ్యర్థాలను రోడ్లపై, కాలువల్లో వేయడం నేరమని, ఇకపై అవిధంగా చేయరాదని హెచ్చరించారు. తోపుడుబళ్ల వర్తకులు, చిరుపండ్ల వ్యాపారులు, షాపు యజమానులు రోడ్లపై వ్యర్థపదార్థాలు వేస్తే జరీమానాలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు, వర్తకులు, చిరువ్యాపారులు సహకరిస్తేనే పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుదల సాధ్యమవు తుందన్నారు. పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రతీఒక్కరూ సహ కరించాలని విజ్ఞప్తి చేశారు. పారిశుద్ధ్యం మెరుగుదల సమిష్టిబాధ్యతగా ప్రతీ ఒక్కరూ గుర్తెరగాలన్నారు. ఇకపై రోడ్లు ప్రక్కన ఉండే వైన్‌షాపులు, టీస్టాల్స్, సామాన్లు వ్యాపారులు, కళాశాలలు, పాఠశాలల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి పారిశుద్ధ్యం మెరుగుదలపై అవగాహన కల్పిస్తామన్నారు. రోడ్లపై ఎక్కడబడితే అక్కడ చెత్తవేసి పరిసరాలను పాడుచేస్తే ఉపేక్షించేది లేదన్నారు. చిరువ్యాపారులు ఎట్టిపరిస్థితుల్లోనూ చెత్తను రోడ్లపై వేయరాదన్నారు. ప్రతీ చిరువ్యాపారి విధిగా డెస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకుని, చెత్తను పురపాలక వాహనాలకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## ఆక్రమణల తొలగింపు



మధురవాడ : మధురవాడ అయిదవ వార్డ్ మానం ఆంజనేయులు కోలని దరి సర్వే సంఖ్య 126/4లోసుమారు అయిదు ఎకరాల విస్తీర్ణంలో కొంత మంది ఆక్రమణ దారులు కబ్జాచేసి పాకలు వేయడాన్ని గమనించి రూరల్ తహశీల్దార్ కార్యాలయానికి సమాచారం రావడం తో సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ తోపాటు విఆర్వోలు,కె అప్పారావు, రిజ్వాన్, దొరను, విఆర్‌ఎలు చిన్నా రావు, అప్పలరాజు,శ్రీను, అప్పారావు లను పంపించారు, వీరు స్థానిక పోలీసు స్టేషను ఎస్ఐ ల సహ కారంతో ఆక్రమణలు తొలగించి కబ్జాదారులను అక్కడ నుండి పంపించి వేశారు.

## దళిత, గిరిజన ప్రాంతాల్లో నూతన దేవాలయాల నిర్మాణం



శ్రీకాకుళం : హైందవ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా... ప్రజల్లో ధార్మిక చైతన్యం కలిగించడమే లక్ష్యంగా దళిత, గిరిజన, మత్స్యకార, వెనుకబడిన ప్రాంతాల్లో నూతన ఆలయాల నిర్మాణాలు చేపట్టనున్నట్లు దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ వై.భద్రాజీ తెలిపారు. ఆయన మాట్లాడారు. మానవ జీవన వికాసంలో ఆలయం పాత్ర ఎంతో విలువైందని చెప్పారు. దేవాదాయశాఖ, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు నిర్వహణలో రాష్ట్రంలో 500 నూతన దేవాలయాల నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రతి జిల్లాలో దళిత, గిరిజన, మత్స్యకార, వెనుకబడిన ప్రాంతాల్లో నూతన ఆలయాలను నిర్మిస్తారని తెలిపారు.

ఇందుకు ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తారని పేర్కొన్నారు. శ్రీరామ, వేంకటేశ్వర, శివా లయాలు, ఆంజనేయ స్వామి, గ్రామ దేవతల ఆలయాల నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తారని తెలిపారు. నూతన ఆలయాల నిర్మాణం చేపట్టదలచిన వారు జిల్లా కేంద్రంలోని పాలకొండ రోడ్డు కోదండరామాలయం పక్కన ఉన్న దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆయన చెప్పారు. వాటిని పరిశీలించి హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు, ఎస్ఐటీఏ భవనం, సీతానగరం, అమరావతి, గుంటూరు జిల్లాకు పంపిస్తామని తెలిపారు. అందరూ ఈ అవకాశాన్ని వినియో గించుకొని నూతన ఆలయాలను నిర్మించాలని ఆయన కోరారు. ఆయనతో పాటు దేవాదాయశాఖ సూపరింటెండెంట్ డీవీవీ.ప్రసాద్ ఉన్నారు.

# పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు సిద్ధం

## నేడే యానాం పోలింగ్







యానాం : పుదుచ్చేరి పార్లమెంటు ఎన్నికలలో జరగనున్న అన్ని పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని యానాం ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివరాజ్ మీనా తెలిపారు. బుధవారం ఉదయం నుండి పరిపాలనాధికారి కార్యాలయం ఎదుట ప్రభుత్వ అతిధి గృహం వద్ద పోలింగ్ సిబ్బందికి యంత్ర సామగ్రి పంపిణీ చేసి ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. పుదుచ్చేరి వ్యాప్తంగా 9,73,460 ఓట్లు కాగా యానాం అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లు 36,562. అందులో పురుషులు 17,630, స్త్రీలు 18,925 మంది ఓటర్లు వున్నారు. 36 పోలింగ్ బూత్‌లు వుండగా ఇందులో 16 సమస్యాత్మక పోలింగ్ బూత్‌లతో పాటు 26 పోలింగ్ బూత్‌లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లకు సుమారు 7గురు సిబ్బందిని నియమించామన్నారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద సుమారు 300మంది పారా మిలటరీ, పోలీసులు బందోబస్తు పర్యవేక్షిస్తున్నారన్నారు. ఎన్నికల నిర్వహణకు సుమారు 400మంది సిబ్బందిని నియమించా మన్నారు. అలాగే పోలింగ్ నిర్వహణకు మరో 400మందిని అదనంగా నియమించామన్నారు. ఓటర్లకు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద కావలసిన సదుపాయాలు సిద్ధం చేశామన్నారు. పుదుచ్చేరి పార్లమెంటుకు గురువారం జరగనున్న పోలింగ్‌లో ఆయా బూత్‌లలో ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు వేసుకోవడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఓటరు స్లిప్పు అందినవారు ఓటరు గుర్తింపుకార్డుతో పాటు ఎన్నికలు చెప్పించ గుర్తింపు కార్డులు పట్టుకెళ్లి ఓటు వెయ్యవచ్చునన్నారు. ఓటు వేయకుండా ఎవరైనా అడ్డుకుంటే నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. మీకు ఆయా పార్టీల అభ్యర్థులకు పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ యంత్రాలలో సరిచూసుకుని ఓటు వేయవచ్చునన్నారు. స్థానిక మిని సివిల్ స్టేషన్‌లో స్ట్రాంగ్ రూంవద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ పూర్తి అయిన వెంటనే ఓటింగ్ యంత్రాలను స్ట్రాంగ్ రూంకి తరలించి అధికారుల సమక్షంలో సీజ్ చేస్తామన్నారు. స్వచ్ఛందంగా ఓటును వినియోగించుకోవాలని ఆయన కోరారు.







# అన్నవరంలో భానుడి ఉగ్రరూపం

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరంలో గత నాలుగు రోజులు నుండి భానుడు తన ఉగ్ర రూపం చూపిస్తున్నాడు.మే నెలలో కాయవలసిన ఎండలు ఏప్రిల్ నెలలోనే ఎండలు మండిపోతున్నాయి.గత ఏడాది కంటే ఈ సంవత్సరం ఈ నెలలో ఇంత ఎండ తీవ్రత ఎన్నడూ చూడలేదని ప్రజలు బెంబేలు ఎత్తుతున్నారు.ఈ నెలలోనే ఎండలు ఇలా ఉన్నాయి అంటే మే నెలలో ఎండలు మరింత తీవ్ర ప్రభావాన్ని చూపుతాయంటున్నారు. ఉదయం 11 గంటలకే ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యముగా మారుతున్నాయి.ముఖ్యంగా ముసలి వారు,చిన్న పిల్లలు,పాద చారులు ఎండ తీవ్రతకు బయటకు రాలేక చెట్టునీడన,చల్లటి ప్రదేశాలలో సేద తీరుతున్నారు.

# ఎమ్మెల్యే పీలాపై చర్యలు తీసుకోవాలి

అనకాపల్లి : బహిరంగంగా పందెకాస్తానంటూ ప్రకటించిన అనకాపల్లి తెలుగుదేశంపార్టీ అభ్యర్థి పీలా గోవిందసత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్సిపి పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేసారు. ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేసారు.

ప్రజా ప్రతినిధి అయి ఉండి బహిరంగ సమావేశాల్లో తన గెలుపు కాయమంటూ ప్రకటించడమే కాకుండా ఎంత పందానికి అయినా దమ్మున్న వారు రావాలని సవాల్ విసరడం ఎంత వరకు సమంజసం అని నిలదీసారు. ఎన్నికల కోడ్ అమలులో ఉంటుండగా పందాలు కాయడం చట్టరిత్యా నేరమని తెలిసి కూడా, ఎమ్మెల్యే పీలా ఈ వ్యాఖ్యాలు చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఇటువంటి ప్రకటనలపై అదికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

# వరప్రసాద్ జీవితగాథను పాఠ్యాంశంగా చేర్చాలి

## - రిటైర్డ్ సిఐడి అధికారి లక్ష్మీనారాయణ



అనకాపల్లి : ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన కరణం వరప్రసాద్ జీవితగాధను పాఠ్యాంశంగా చేర్చాలనే డిమాండ్తో కృషిచేస్తానని రిటైర్డ్ సిబిఐ అధికారి, జనసేన నాయకులు జె.డి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కరణం వరప్రసాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రసాద్ 6 వ సంస్మరణ దినోత్సవం వేడుకలు విజయా రెసెడెన్సీలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథిగా పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేహం, దేవుడు కు మధ్యన దేశం ఉంటుందని మరిచిపోకూడన్నారు. దేశం ఏమిచ్చిందనే కన్నా దేశం కోసం నువ్వేం చేశావు అన్న వైఖరిని అవలంభించుకోవాలన్నారు. ప్రాణాలు పోతాయని తెలిసినా తన తోటి సిబ్బంది ని రక్షించి ప్రాణాలను పోగొట్టుకున్న వీరుడు వీర శౌర్య ప్రసాద్గా కితాబిచ్చారు. నరనరాన దేశభక్తి జీర్ణించుకుంటేనే తప్ప త్యాగం చేయలేమన్నారు. భవిష్యత్లో విద్యార్థులు తమ స్థాయిలో సమాజానికి ఉపయోగపడే విధంగా తయారు అవ్వాలని సూచించారు. విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచే వరప్రసాద్ జీవితగాధను పాఠంగా చేర్చేందుకు, శిలాఫలకం ఏర్పాటుకు తన వ్యక్తిగత అజెండాగా స్వీకరించి కృషిచేస్తానన్నారు. ఏడాదిలోగా అవి పూర్తయ్యేలా ప్రయత్నిస్తానన్నారు.

ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవలను కొనియాడారు. లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. కార్యక్రమానికి ఆర్క్ సంస్థ అధ్యక్షులు ప్రసాద్ అధ్యక్షత వహించారు.

ఫారెస్టు ఆఫీసర్ రామనరేష్, గ్రేహౌండ్స్ డియస్పీ రామారావు, ట్రేడ్ యూనియన్ నాయకులు గడసాల అప్పారావు, సీతామహలక్ష్మి, తల్లిదండ్రులు వెంకటరమణ, సత్యవతి, కుటుంబ సభ్యులు లాయర్ కళావతి, చైతన్య, వేలం నూకరాజు, డాక్టర్ రామ్మోహన్ పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈనాటి బాలలే రేపటి పౌరులు

## మల్కాపురం సిఐ లంక భాస్కర రావు



ములగాడ : మల్కాపురం 48 వ వార్డు జీవీఎంసీ ప్రైమెరీ పాఠశాల విద్యార్థుల ఐదో తరగతి పూర్తి చేసుకుని ఆరో తరగతి వెళుతున్న విద్యార్థులకు పెన్నులు పుస్తకాలు జామెంట్రీ బాక్స్ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాపురం సీఐ లంక భాస్కర్ రావు పాల్గొని ఆయన చేతుల మీద విద్యార్థులకు పంపిణీ చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నాటి బాలలే రేపటి పౌరులు అంటూ ప్రతి ఒక్క విద్యార్థి బాగా చదువుకొని మంచి స్థాయికి రావాలని వారికి మా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఇంత మంచి అవకాశం ఇచ్చిన పాఠశాల ప్రధాన ఉపాధ్యాయునికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు నాగమణి ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# 'సమష్టి కృషితో గెలుపునకు బాటలు వేద్దాం'

సత్తుపల్లి : రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాలను గెలుపొందేందుకు సమన్వయంతో కృషి చేద్దామని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. స్థానిక కళాభారతి ఆడిటోరియంలో ఆ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు పరెడ్ల సత్యనారాయణరెడ్డి, కొర్రపాటి సాల్మన్ రాజు అధ్యక్షతన కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉడతనేని అప్పారావు మాట్లాడుతూ వర్గ విభేదాలు లేకుండా ఐకమత్యంతో కలిసిగట్టుగా పని చేయాలని సూచించారు. పరెడ్ల, కొర్రపాటి మాట్లాడుతూ మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్ఛార్జి సంభాని చంద్రశేఖర్ సమావేశాన్ని నిర్వహించారు.

# సత్తెమ్మ తల్లిని దర్సించుకున్న అమర్నాధ్



అనకాపల్లి : స్థానిక గవరపాలెం దాసరిగెడ్డ రోడ్డులో వెలసి ఉన్న సత్తెమ్మ తల్లి అమ్మవారిని అనకాపల్లి వైఎస్ఆర్ కాంగ్రెస్పార్టీ అభ్యర్ధి గుడివాడ అమర్నాధ్, పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ బుధవారం దర్సించుకున్నారు. ప్రత్యేకపూజలు నిర్వహించారు. శ్రీ సత్తెమ్మతల్లి ఆలయ కమిటీ వారి ఆహ్వానం మేరకు వీరు ఆలయానికి విచ్చేసారు.

ఈ ఎన్నికల్లో వైసీపీ ఘనవిజయం సాధించి జగన్ గారు సీఎం కావాలని అమ్మవారిని కోరుకున్నారు. అలాగే ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు మాజీ కౌన్సిలర్ పొలమరశెట్టి మురళి, బొడ్డేడ మోహనరావు, బుద్ధ కిషోర్, పిళ్ళా త్రినాధ్, బుద్ధ శేఖర్, దాడి సురిఅప్పారావు, దాడి అప్పారావు, కె.నూకేశ్వరరావు,

భీశెట్టి తిరుమల, దొడ్డి రామునాయుడు, పి.సన్యాసినాయుడు, మళ్ల వెంకటరావు, పెంటకోట నాయుడు, దాడి గోపి, ఆర్.రాంబాబు, పెంటకోట సంతోష్ లతోపాటు వైసీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శిలు మందపాటి జానకిరామరాజు, సూరిశెట్టి రమణ అప్పారావు, వైసీపీ నాయకులు కొణతాల మురళీక ృష్ణ, పెతకంశెట్టి జగన్ మోహనరావు, సిలపరశెట్టి బాబీ, బొడ్డేడ శివ తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలపై అవగాహన



కాకినాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో కాకినాడ ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అగ్నిమాపక అధికారి ఎం. రాజా ఆధ్యంలో రైల్వేస్టేషన్, బస్స్టాండ్, బర్మాకాలని, సర్పవరం ఎస్ఆర్ఎంటి అపార్టు మెంట్ సమూహంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలు, మెలుకువలు, నివారణా చర్యలు పై మహిళలు, పిల్లలు ,పెద్దలకు వివరించారు.ముఖ్యంగా వంటగదిలో మహిళలు తీసుకోవలసిన రక్షణ చర్యలు, వంట గ్యాస్ వినియోగంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, విద్యుత్ ప్రమాదాలు సంభవించినచో ఫైర్ఎక్స్టింగిషర్ల సహాయముతో ఏవిధంగా ప్రమాదాలు నివారించ వచ్చునో ప్రయోగాత్మకంగా వివరించారు. గోడపత్రికలు వేసి ,కరపత్రాలుపంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# కేజీహెచ్ సూపర్డెంట్ ఘన సన్మానం చేస్తున్న

## : పెద్దిరెడ్ల నానాజి



ములగాడ: కేజీహెచ్ సూపర్డెంట్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అర్జున్ కు బుధవారం పశ్చిమ నియోజకవర్గ ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్ల నానాజీ పూలమాలలు వేసి కప్పి ఘనంగా సన్మానం చేశారు.

ఈ కార్యక్రమంలో నానాజీ మాట్లాడుతూ డాక్టర్ అర్జున్ ఎప్పుడు అందుబాటులో ఉంటూ ఫోన్ చేయగానే త్వరగా స్పందిస్తూ ఎంతో పేదవారికి ఎన్నో ఆపరేషన్లు చేసి ప్రాణాలు నిలబెట్టారని రోగులకు ఎటువంటి కష్టం వచ్చినా వారికి ఆ కష్టాన్ని తెలుసుకొని పరిష్కరించి మార్గం చూపే పెడుతున్నారని అలాంటి వ్యక్తికి ఈరోజు మా చేతుల మీదుగా సన్మానం చేయడం చాలా ఆనందంగా ఉందని ఇంకా ఎన్నో సేవలు పేద ప్రజలకు అందిస్తూ వారి యొక్క మన్ననలు పొందాలని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో కొయలడ రమణ కొయలడ వెంకట్రావు కోడూరు సత్యం అప్పారావు కన్నారావు పాల్గొన్నారు.

# లాభసాటి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

ఖమ్మం : లాభసాటి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. ఖమ్మంలోని ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ హాల్లో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో మధ్య తెలంగాణ మండల పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్, మెదక్ జిల్లాల వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు వాణిజ్యపరంగా లాభం చేకూర్చేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

వ్యవసాయ సీజన్ మొదలైన దగ్గర నుంచి రైతులకు సరైన విత్తనాలు, ఎన్నుకుని యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదే విధంగా విలువ ఆధారిత ఉత్పత్తులను పెంపొందించుకోవాలని కోరారు.

# పేదలకు బియ్యం పంపిణీ



అనకాపల్లి ... మండలంలోని సుబ్రమణ్యం కోలనీలో పేదలకు 5 కేజీలు బియ్యం ప్యాకెట్ల పంపిణీ జరిగింది. న్యూ ఇండియా ఇన్సూరెన్స్ అసిస్టెంట్ మేనేజర్ రాజాబాబు, పాస్టర్ దాడి ప్రకాష్ ఆద్వర్యంలో ఈ కార్యక్రమంలో జరిగింది. రాజాబాబు 25వ వివాహ వార్సికోత్సవ వేడుకలను పురస్కరించుకుని వీటిని అందజేసారు. ఈసందర్భంగా ముఖ్య అతిధిగా పాల్గొన్న రాజాబాబు మాట్లాడుతూ పేదవాడికి సహాయం చేయడంలోనే నిజమైన సంతృప్తి లభిస్తుందని అన్నారు. పేదల మద్య, తన వివాహ వేడుకలను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డెవిడ్, సాయి, మంగయ్యమ్మ, స్దానికులు పాల్గొన్నారు.

## నూకాంబికను దర్సించుకున్న అధికారులు



అనకాపల్లి ... అనకాపల్లి నూకాంబికా అమ్మను పలువురు అదికారులు బుదవారం దర్సించుకున్నారు. విఈపిజెడ్ కమీషనర్ ఎ. రామ్మోహన్రెడ్డి, జాయింట్ కమీషనర్ వి. కిషోర్ బాబు అమ్మవారి ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. వేదపండితులు ఆశీర్వదించారు. తీర్ధ ప్రసాదాలు అమ్మవారి ఫోటోను అందజేసారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి సుజాత ప్రముఖ వ్యాపార వేత్త కోలపర్తి కన్నబాబు, ఆలయ సిబ్బంది మురళీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వేసవికాలములోజాగ్రత్తలుపాటించండి

## - వడదెబ్బనుతరిమికొట్టండి

## - పరవాడవైద్యాదికారణి ప్రమీల



పరవాడ : వేసవికాలములోతగు జాగ్రత్తలు తీసికుంటే వడదెబ్బనుతరిమికొట్టచ్చుఅని పరవాడపిహెచ్ సి వైద్యాదికారణి డాక్టర్ ప్రమీల అన్నారు.బుదవారము అమె విజయభాను ప్రతినిదితో మాట్లడుతూ మండువేసవిలో, తీవ్రఉష్ణోగ్రత సమయంలో ఎక్కువుగాతిరుగరాదుని,మద్యంసేవించ రాదుని, రోడ్లు మీదచల్లనిరంగుపానీయాలు త్రాగరాదుఅనిఅన్నారు. రోడ్లు మీద అమ్మేకలుషితఅహరముతినరాదుఅని, మాంసాహరముతగ్గించి, తాజాకూరగాయాల్ని ఎక్కువుగాఅహరంలో తీసుకోవాలని అన్నారు. ఇంట్లోని,చుట్టప్రక్కలశుభ్రతపాటించి, దోమలు లేకుండా చూసుకోవాలనీఅన్నారు. ఇటువంటి జాగ్రత్తలు అన్నితూచాతప్పకుండా పాటిస్తే వడదెబ్బను తరిమికోట్టచ్చని అన్నారు. ప్రదమచికిత్స వడదెబ్బతగిలినవ్యక్తిని త్వరగానీడగల ప్రదేశానికిచేర్చాలి. ఐస్ నీటిలో ముంచినతడిగుడ్డతో శరీరముతుడవాలి.శరీరము ఉష్ణోగ్రత సాదారణస్దాయికివచ్చే వరకుతుడవాలి.ఉప్పుకలిపిన మజ్జిగతీస ి కోవాలనీఅన్నారు. వడదెబ్బతగిలిఅపస్మారకస్థితిలోవున్నరోగికి నీరుత్రాగించకుడదనిఅన్నారు. వీలుఅయనంత త్వరగాదగ్గర లోని వున్నప్రాదమిక అరోగ్యకేంద్రానికితరిలించాలనీకోరారు.

# విద్యుత్తు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

కొత్తగూడెం : విద్యుత్ శాఖకు సంబంధించి వినియోగదారులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నా తమ ద ృష్టికి తేవాలని 'విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక' వేదిక ఛైర్మన్ కందుల క ృష్ణయ్య అన్నారు. కొత్తగూడెం సబ్ డివిజన్ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి సబ్ స్టేషన్లో 'విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుత్ బిల్లింగ్ సమస్యలు, కొత్త మీటర్ల సమస్యలు, విద్యుత్ నియంత్రికలు, అదనపు స్తంభాల ఏర్పాటు తదితర ఏ ఇబ్బందులున్నా తమ ద ృష్టికి తేవచ్చని అన్నారు. ప్రతి నెలా ఏదో ఒక మండలంలో ఇలాంటి వేదికను ఏర్పాటు చేసి అక్కడి వినియోగదారులు సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు అవకాశం ఉంటే ఎలాంటి జాప్యానికి తావివ్వవకుండా అక్కడికక్కడే ఆయా విభాగాల అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. ప్రధానంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు తక్షణ పరిష్కారం చూపించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# 100 సార్లు స్నానం చేసినా మీరంతే..

## - భాజపా మాజీ ఎమ్మెల్యే రాజు కాగే



బెంగళూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పార్టీల నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం తెలిసిందే. కాని ఆ విమర్శలు నానాటికీ తారస్థాయికి చేరుకుంటున్నాయి. సమాజంలో తమ స్థాయిని మర్చిపోయి ఎదుటివారిపై కొందరు నేతలు చేస్తున్న వ్యాఖ్యలు ప్రజలను ఆశ్చర్యపరుస్తున్నాయి. తాజాగా కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి గురించి భాజపా మాజీ ఎమ్మెల్యే అలాంటి వ్యాఖ్యలే చేశారు. మోదీ ఇంటి నుంచి బయటకి వచ్చే ముందు ముఖానికి 10 సార్లు పౌడర్ రాసుకుంటారని, రోజులో 10 సార్లు దుస్తులు మారుస్తారని కుమారస్వామి అన్నారు. మోదీ ముఖంలోనే ఆ తేజస్సు ఉంది. కాని కుమారస్వామి 100 సార్లు స్నానం చేసినా బర్రెలానే ఉంటారు అని వ్యాఖ్యానించారు.

ప్రధాని మోదీకి టీవీల్లో ప్రచారం బాగా లభిస్తుందంటూ కుమారస్వామి గతంలో అన్నారు. మోదీ ఇంటి నుంచి బయటకి వచ్చేటప్పుడు 10 సార్లు పౌడర్ రాసుకుని వస్తారు. టీవీల్లో బాగా కనిపించడానికే మోదీ అలా చేస్తున్నారు. మేము సాధారణ మనుషులం. ఉదయం స్నానం చేసి బయటకి వస్తాం. మళ్లీ మరునాడు ఉదయం స్నానం చేస్తాం. ఈలోపు ఒకటి రెండు సార్లు ముఖం కడుక్కుంటాం. అందుకే మా ముఖాల్లో అంత తేజస్సు కనిపించదు. ఈ కారణంతోనే కొందరు పాత్రికేయులు మోదీని చూపించినట్లుగా మమ్మల్ని టీవీల్లో సరిగా చూపించడం లేదు అన్నారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన రాజు కాగే కుమారస్వామిని వ్యక్తిగతంగా విమర్శించారు. ఇదే తరహాలో సినీనటి జయప్రద గురించి ఎస్పీ పార్టీకి చెందిన ఒక నేత వ్యక్తిగత విమర్శ చేశారు. దీనికి సంబంధించి దేశవ్యాప్తంగా పెద్ద దుమారమే చెలరేగింది.

నాయకులు తాము చేసిన అభివృద్ధి, చేయదలచిన అభివృద్ధి, పార్టీ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరించడం మానేసి ఇలా వ్యక్తిగత విమర్శలకు దిగడం ఏమాత్రం మంచిది కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. వారి విమర్శల స్థాయి దిగజారే కొద్దీ వారికి ప్రజల్లో ఉన్న ఆదరణ తగ్గడమే కాకుండా వారిపై వ్యతిరేకత వచ్చే అవకాశాలు ఉన్నాయని, తద్వారా అల్లర్లు కూడా చెలరేగుతాయంటూ హెచ్చరిస్తున్నారు.

# విరాట్ కోహ్లీ విషయంలో జాగ్రత్తగా ఉంటాం: కివీస్ బౌలర్



ఇంగ్లండ్, వేల్స్ వేదికగా ఈ ఏడాది మే 30 నుంచి ప్రారంభంకానున్న క్రికెట్ ప్రపంచకప్ కోసం అభిమానులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పలు క్రికెట్ బోర్డులు ఈ మహా సంగ్రామం బరిలోకి దిగే తమతమ జట్లను ప్రకటించాయి. సోమవారం టీం ఇండియా కూడా 15 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను వెల్లడించింది. అయితే చాలా రోజుల క్రితమే న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు తమ జట్టును ప్రకటించింది.

ఈ క్రమంలో ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ తరపున ఆడుతున్న న్యూజిలాండ్ ఆటగాడు లోకీ ఫెర్గుసన్ టీం ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. విరాట్ ఒక అంతర్జాతీయ స్టార్ అని అతను అన్నాడు.

అతను(విరాట్) ఒక అంతర్జాతీయ స్టార్. ఐపీఎల్‌లో ఆడటం వేరు.. భారత్ తరపున ఆడటం వేరు. న్యూజిలాండ్ పర్యటనలో అతను ఆశించిన విజయం దక్కలేదు. కానీ, దాని ప్రభావం ప్రపంచకప్‌పై ఉండదు. ప్రపంచకప్ అనేది ఓ ప్రత్యేకమైన టోర్నమెంట్.. అక్కడ ఉండే జట్లు, ఆడే విధానం అంతా వేరు. కాబట్టి అక్కడ విరాట్ కోహ్లీ విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిందే.. లేకుంటే అతను పరుగుల వరద పారిస్తాడు అని ఫెర్గుసన్ పేర్కొన్నాడు.

అంతేకాక.. కోహ్లీ విషయంలో న్యూజిలాండ్ క్రికెట్ జట్టు చాలా జాగ్రత్తగా ఉంటుందని అతను తెలిపాడు. ప్రపంచకప్‌లో ఇండియాతో ఆడుతున్న సమయంలో కోహ్లీ బ్యాటింగ్‌ని కట్టడి చేసే ప్రయత్నం చేస్తామని పేర్కొన్నాడు.

# బీజేపీ నేతలపై మహిళా కమిషన్‌కు పిర్యాదు

కర్నాటక: బీజేపీ నేతలు లైగింకంగా వేధిస్తున్నారంటూ కర్నాటక రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఓ మహిళ బుధవారం పిర్యాదు చేశారు. బీజేపీ పార్టీకి చెందిన మైసూరు ఎంపీ ప్రతాప్ సింహా తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని మహిళ పిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా బెంగళూరు సౌత్ నుంచి బీజేపీ తరపున ఎన్నికల్లో పోటీ చేస్తోన్న తేజస్వీ సూర్య కూడా ఇతర మహిళను లైగికంగా వేధిస్తున్నారని పిర్యాదులో వెల్లడించారు. ఈ నేతలపై వెంటనే చర్యలు తీసుకోవాలని పిర్యాదులో కోరారు.

# దేశ శత్రువులు, పరిరక్షకులకు మధ్యే పోటీ: రాందేవ్

న్యూఢిల్లీ: దేశ శత్రువులు, పరిరక్షకుల మధ్య జరుగుతున్న పోటీనే ఈ ఎన్నికలని యోగా గురు రాందేవ్ బాబా అన్నారు. నరేంద్ర మోదీ చేతుల్లోనే దేశం సురక్షితంగా ఉంటుందని చెప్పారు. ఎన్నికల సీజన్‌లో ఏది తప్పు, ఏది ఒప్పు అనేది తెలుసుకుని మరీ ఎంపిక చేసుకోవాలని ఓటర్లకు సూచించారు. గత ఐదేళ్లలో నరేంద్ర మోదీ ఎన్నో విజయాలు సాధించారని, విపక్షాల దగ్గర మాత్రం దేశ ప్రజలకు మేలు చేసే నిర్ధిష్ట వ్యూహం ఏదీ లేదని అన్నారు. 'సరైన విజన్ లేకుండా మోదీని తిట్టడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న వారిని, దేశానికి శత్రువులైన వారిని పార్లమెంటుకు పంపాలనకుంటున్నారా అనేది ప్రజలు నిర్ణయించుకోవాలి. భద్రత అశం కీలకమైనది. ఇది కేవలం దేశ భద్రతకే పరిమితం కాదు, రైతులు, వ్యవసాయం, మన సంస్కృతి భద్రతకు సంబంధించిన అంశం. నరేంద్ర మోదీ తప్ప అలాంటి భద్రత కల్పించే వాళ్లెవరూ నాకు కనిపించడం లేదు' అని రాందేవ్ బాబా అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేరును నేరుగా ఆయన ప్రస్తావించకుండానే 'గత ఐదేళ్లలో నరేంద్ర మోదీ ఎలాంటి స్వప్రయోజనాల కోసం పని చేయలేదు. ఆయనకు కుటుంబం లేదు. సొంత ఇల్లు లేదు. ఆయనో ఫకీరు. ఈ దేశం అనువంశిక పాలనను దశాబ్దాలుగా చవిచూసింది' అని ఆయన అన్నారు.

# శ్రీరెడ్డి ఆరోపణలపై ఎట్టకేలకు స్పందించిన తెలంగాణ ప్రభుత్వం.. జీవో జారీ



హైదరాబాద్ : టాలీవుడ్‌లో లైంగిక వేధింపులు పెరిగిపోయాయని సినీ నటి శ్రీరెడ్డి కొన్నాళ్ల క్రితం చేసిన ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం ఎట్టకేలకు స్పందించింది. శ్రీరెడ్డికి మద్దతుగా అప్పట్లో మహిళా సంఘాలు వేసిన పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ప్యానల్ ఏర్పాటుకు అంగీకారం తెలిపింది. ప్యానల్ ఏర్పాటుకు సంబంధించి జీవోను విడుదల చేసింది. జీవో నంబర్ 984 ప్రకారం.. సినీ నటి సుప్రియ, సినీ నటి, యాంక ర్ ఝాన్సీ, దర్శకురాలు నందిని రెడ్డిలను తెలంగాణ ప్రభుత్వం ఈ కమిటీలో టాలీవుడ్ ప్రతినిధులుగా నియమించింది. నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వసంతి, గాంధీ మెడికల్ కళాశాల వైద్యురాలు రమాదేవి, సామాజిక కార్యకర్త విజయ లక్ష్మిలతో ఈ కమిటీ ఏర్పాటైంది. తెలంగాణ స్టేట్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రామ్ మోహన్ రావు, నిర్మాతదర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ, దర్శకనిర్మాత సుధాకర్ రెడ్డి కూడా సభ్యులుగా ఉన్నారు. రాంమోహన్ రావు ఈ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సినీ పరిశ్రమకు సంబంధించిన మహిళలు తమను ఎవరైనా వేధిస్తే ఈ కమిటీ ముందు నిర్భయంగా చెప్పవచ్చని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిటీ తెలిపింది.

# హైదరాబాద్‌లో కాజోల్ సందడి



హైదరాబాద్‌లో ప్రముఖ బాలీవుడ్ నటి కాజోల్ సందడి చేశారు. కాప్రా సర్కిల్ ఏఎస్ రావు నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జోయాలుక్కాస్ ఆభరణాల షోరూంను ఆమె బుధవారం జ్యోతి వెలిగించి ఘనంగా ప్రారంభించారు. కాజోల్‌ను చూడటానికి ఆమె అభిమానులు ఎండను సైతం లెక్కచేయకుండా పెద్దసంఖ్యలో చేరుకుని కాజోల్‌ను చూసి ఉత్సాహంతో కేరింతలు కొట్టారు.

ఈ సందర్భంగా కాజోల్ మాట్లాడుతూ జోయాలుక్కాస్ కొత్త షోరూంను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ఆభరణాలు ప్రేమికుల్ని, నా అభిమానుల్ని కలుసుకున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. జోయాలుక్కాస్ ద్వారా ఈ ఆత్మీయ కలయిక గొప్ప మధురానుభూతినిచ్చిందని కాజోల్ తెలిపారు. ప్రారంభోత్సవ సందర్భంగా ఆభరణాలు కొనుగోలు చేసిన ప్రతి వినియోగదారుడికీ కచ్చితమైన ఉచిత బహుమతి అందించనున్నట్టు జోయాలుక్కాస్ గ్రూప్ ఛైర్మన్ అండ్ ఎండీ జోయ్ అలుక్కాస్ తెలిపారు. 2020 నాటికి 200 షోరూంలే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

# హైబీపీ తగ్గించే కిస్‌మిస్



ఎండుద్రాక్షలో విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి. యాంటీయాక్సిడెంట్లు, పీచు వంటివి రక్తహీనతను దరిచే రనివ్వవు. ఎండుద్రాక్షలకు జీర్ణక్రియను మెరుగుపరిచే శక్తి ఉంది. వీటిని క్రమం తప్పకుండా రోజుకు ఆరు లేదా ఐదింటిని తీసుకుంటే.. చిన్న పేగులోని వ్యర్థ పదార్థాలను సులభంగా వెలివేసినవారమవుతాం. ఎండుద్రాక్షల్లోని పీచు కడుపులోని నీటిని పీల్చేస్తుంది. తద్వారా విరేచనాలు వంటి ఉదర సంబంధిత రుగ్మతలను దూరం చేస్తుంది. ఇవి రక్త హీనతకు మంచి మందుగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా స్త్రీల కు ఇది ఎంతో ఉపయోగం. వీటిలో ప్రోటీన్లు, విటమిన్లు పుష్కలంగా ఉండటం ద్వారా బక్కపలచగా ఉన్నవారు తీసుకోవచ్చు. తద్వారా బరువు పెరుగుతారని న్యూట్రీషన్లు చెప్తున్నారు. క్రీడాకారులు తన శరీరానికి బలం చేకూర్చుకోవాలంటే.. ఎండుద్రాక్షల్ని తీసుకోవడం మంచిది. ఎండుద్రాక్షల్లోని ధాతువులు, కొలెస్టరాల్, విటమిన్లు, పీచు వంటివి శరీరానికి పోషకాలను అందిస్తాయి. వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి.

వీటిలోని యాంటీయాక్సిడెంట్లు క్యాన్సర్ కణాలను దూరం చేస్తాయి. హైబీపీని నివారిస్తాయి. గుండెను పదిలంగా ఉంచుతాయి. ఎండుద్రాక్షల్లో పొటాషియం రక్తనాళ్లాల్లో ఒత్తిడిని తగ్గించి ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇంకా వీటిలో విటమిన్ బి కాంప్లెక్స్, ఐరన్ ఉండటం ద్వారా రక్తకణాల ఉత్పత్తికి ఎంతగానో ఉపకరిస్తాయి.

ద్రాక్ష పండ్లను ఎండబెట్టినప్పుడు, ఎండు ద్రాక్ష తయారవుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తిఅయ్యే ద్రాక్షలో 80 శాతం పంటను వైన్ తయారీలో వాడుతారు. ఏడు శాతాన్ని ఎండు ద్రాక్షగా మలుస్తారు. మిగిలిన, శాతాన్ని మాత్రమే తాజాగా తినడానికి గాని జ్యూస్ తీసి వాడుకోవటానికి గాని వాడుతారు. మంచి పోషకాహర విలువలు కలిగి ఉంటాయి. కొన్ని రకాల వ్యాధులు సోకినప్పుడు ఇవి ఉత్తమ ఆహారంగా ఉపయోగ పడుతాయి

సంతానం లేని స్త్రీలు కిస్‌మిస్ పండ్లు తింటే అండాశయములోని లోపాలు తొలగి సంతానము కలుగుతుంది. మహిళలు ప్రతిరోజూ కిస్‌మిస్ పండ్లు తినుటవలన యూరినల్‌లో ఆమోనియా పెరగకుండా రాళ్ళు చేరకుండా కాపాడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కిస్‌మిస్ పండ్లను తరుచుగా తినడం వలన శరీరములో పులుపును స్వీకరించే శక్తిగల ఆమ్లాలను సమానం చేసి జ్వరము రానీయకుండా చేస్తుంది. 200 మిల్లిగ్రాముల పాలతో 50 గ్రాముల కిస్‌మిస్ పండ్లు తినడం వలన నరాల నిస్సత్తువ, రక్తపోటు దీర్ఘకాల వ్యాధులు నయమవుతాయి.

అలాగే రక్తం శుభ్రపడటానికి నరాలకు బలము చేకూరటానికి పది కిస్‌మిస్ పండ్లను నీళ్ళలోవేసి బాగా వుడకబెట్టి గుజ్జుగా వేసి తాగడం చేయాలని న్యూట్రీషన్లు సూచిస్తున్నారు. పిల్లలు రాత్రపూట పక్క తడుపుతుంటే వారికి వారంపాటు ప్రతిరోజూ రాత్రి రెండు ఎండు ద్రాక్ష పొలుకులను ఇవ్వండి. ఈ వారంలో వారికి చలవచేసే వస్తువులు, పెరుగు, మజ్జిగలాంటి పదార్థాలను ఇవ్వకండి. దీంతో పక్క తడిపే అలవాటునుంచి ఉపశమనం కలుగుతుంది. గొంతు వ్యాధితో బాధపడేవారు ఎండు ద్రాక్షను తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది . ఎందుకంటే ఈ ఎండు ద్రాక్ష శరీరంలోని శ్వాసనాళికలో పేరుకుపోయిన కఫాన్ని తొలగిస్తుంది. దీంతో ఉపశనం కలుగుతుంది మలబద్ధకంతో బాధపడేవారు ప్రతిరోజూ రాత్రపూట పడుకునేముందు ఎండుద్రాక్షతోబాటు సోంపును కలిపి తీసుకుంటే మలబద్ధకంనుంచి ఉపశమనం కలుగుతుంది. ఎండు ద్రాక్షను బాగా వేడి చేసిన నీళ్ళలో నానబెట్టి తర్వాత పిల్లలకు ఇస్తే వారిలో జీర్ణశక్తి బాగా వృద్ధి అవుతుంది.

# లాభసాటి సాగు మన లక్ష్యం



హైదరాబాద్ : రాష్ట్రంలో కోటీ 25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలుగా నీటిపారుదలరంగాన్ని అభివృద్ధిపరుస్తున్నామని, ఫలితంగా రాబోయే రోజుల్లో పంటల దిగుబడులు భారీగా పెరుగుతాయని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తెలిపారు. అందుకు తగినట్లుగా రైతులకు కనీస మద్దతు ధర కల్పించేలా అవసరమైన వ్యూహం ఖరారుచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గింజకు మద్దతు ధర.. లాభసాటి సాగు మన లక్ష్యమని చెప్పారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పించే వ్యూహాన్ని రూపొందించేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్, పౌరసరఫరాలు తదితర శాఖలన్నీ సమన్వయంతో వ్యవహరించి , రైతులకు కనీస మద్దతు ధర కల్పించి, వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. దీనికోసం తెలంగాణ రాష్ట్రంలోని ప్రజల ఆహార అవసరాలేమిటి? ఏది ఎంత తింటున్నారు? ఎంత పండిస్తున్నారు? ఎంత దిగుబడి చేసుకుంటున్నారు? ఎంత ఎగుమతి చేస్తున్నారు? తదితర అంశా ల్లో ఖచ్చితమైన గణాంకాలు రూపొందించాలని ఆదేశించారు.

దీనికి అనుగుణంగా ఏమి పండించాలి? ఏమి పండించవద్దు? ఏ పంటల సాగును ప్రోత్సహించాలి? మొత్తం గా ఏది లాభదాయకం? ఏది ఉపయుక్తం? అనే విషయంలో నిర్దిష్ట అభిప్రాయానికి రావాలని చెప్పారు. ఈ అంశాల్లో ఖచ్చితమైన వివరాలు రాబట్టేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పదిరోజుల్లో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, సమగ్ర సమాచారం సేకరించాలని ఆదేశించారు. ఈ ఖచ్చితమైన అంచనాలతోనే రాష్ట్రంలో క్రాప్ కాలనీలు ఏర్పాటుచేయాలని చెప్పారు. రైతులు పండించిన ప్రతీ గింజకు మంచి ధర వచ్చే విధంగా ప్రభుత్వ విధానం ఉండాలని పేర్కొన్నారు. రైతుల నుంచి నేరుగా మార్కెటింగ్‌శాఖ కొనుగోళ్లు జరుపాలని, నిధుల సేకరణ కోసం మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు ప్రభుత్వం పూచీకత్తు ఉంటుందని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. రైతులు పండించిన పంట మార్కెట్‌కు వచ్చి, కాంటా అయిన ఐదు నిమిషాల్లోనే రైతులకు చెక్కు ఇచ్చే పద్ధతి రావాలన్నారు. మార్కెటింగ్‌శాఖే కొనుగోళ్లు చేయడంవల్ల పోటీతత్వం పెరుగుతుందని చెప్పారు. మంచిధర వస్తుందన్నారు. మార్కెటింగ్ శాఖ రైతుల నుంచి కొనుగోళ్లు జరిపి, ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేయాలని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు ఎవరూ సరుకులు కొనకుండా చూడాలని సీఎం ఆదేశించారు. దేశ విదేశాల్లో మార్కెట్ పోటీదారులను గుర్తించి, వారిని ఎదుర్కొనే వ్యూహం రూపొందించాలన్నారు.

### తినేవాటినిబట్టి ఉత్పత్తి చేద్దాం

తెలంగాణలోని ప్రజలు ఏ ఆహార పదార్థాన్ని ఎంత తింటారో ఖచ్చితమైన అంచనా ఉంటే.. ఏది పండించాలో నిర్ణయించవచ్చునని, ఏ పంటకు మంచి మార్కెట్ ఉందో తెలుసుకుని పంటలను సాగుచేస్తే మంచి ధర వస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. అందుకే వ్యవసాయశాఖ అధికారులు , సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ఒక్కో రైతు నుంచి వివరాలు తీసుకుని, ఏ గుంట భూమిలో ఏది సాగుచేస్తున్నారో వివరాలు సేకరించాలన్నారు. బియ్యం ఎంత తింటున్నారు? కూరగాయలు ఎన్ని తింటున్నారు? పప్పుదినుసులు ఎంత తింటున్నారు? మసాలా దినుసులు ఎంత తింటున్నారు? నూనె గింజల వాడకం ఎంత? తదితర విషయాలు సేకరించాలి. ఖచ్చితమైన వివరాలు ఉంటే అందుకు అనుగుణంగా పంటలు సాగుచేయడానికి వీలుగా క్రాప్ కాలనీల ఏర్పాటు సాధ్యమవుతుంది. పండించిన పంటకు మంచి మార్కెట్ రావడానికి ప్రభుత్వమే పూనుకుని చర్యలు తీసుకోవాలి. రైతులు కూడా పండించిన పంటనంతా ఒకేసారి మార్కెట్‌కు తీసుకురాకుండా గ్రామాలవారీగా మార్కెట్‌కు తీసుకువచ్చే పద్ధతిని వారికి అలవాటు చేయాలి. రైతు సమన్వయ సమితులను ఉపయోగించుకోవాలి అని ముఖ్యమంత్రి వివరించారు. మనం ప్రతీ రోజు కూరల్లో కొత్తిమీర, మెంతికూర, పుదీన, జిలుకర వేసుకుంటాం. కానీ అవి మనం పండించం.

ఎక్కడినుంచో దిగుమతి చేసుకుంటాం. మామిడిపండ్లు, బత్తాయిలు, ఇతర పండ్లు తింటాం. వాటిని కూడా దిగుమతి చేసుకుంటాం. చివరికి కూరగాయలను కూడా వేరే రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకునే దుస్థితి వచ్చింది.

రాష్టంలో 142 మున్సిపాలిటీలున్నాయి. నగర జనాభా 50 శాతానికి చేరుకుంటున్నది. ప్రజలకు అవసరమైన కూరగాయలను ఆ పట్టణాల చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో పండించవచ్చు. కానీ పండించడంలేదు. గతంలో గ్రామాల్లో పండించే కూరగాయలను పట్టణాలకు తీసుకొని వెళ్లి అమ్మేవారు. కానీ నేడు వేరే ప్రాంతాల నుంచి పట్టణాలకు దిగుమతి చేసుకుని, పట్టణాల నుంచి కూరగాయలను గ్రామాలకు తీసుకొని వెళ్లి అమ్ముతున్నారు. ఈ పరిస్థితి పోవాలి. మనం తినే కూరగాయలు, పండ్లు, ఇతర ఆహార పదార్థాలను మనమే పండించుకోవాలి. ఒక్క బస్తా బియ్యం కూడా తెలంగాణకు దిగుమతి కావద్దు. మనమే ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసుకోవాలి. అంకాపూర్ రైతుల మాదిరిగా దేశంలో ఏ పంటకు ఎక్కడ మంచి మార్కెట్ ఉందో తెలుసుకొని దానికి అనుగుణంగా పంటలకు మంచి ధర రాబట్టుకోవాలి అని ముఖ్యమంత్రి సూచించారు.

### తెలంగాణ ప్రయత్నం దేశానికే ఆదర్శం

తెలంగాణ రాష్ట్ర ఆలోచన ప్రకారమే అన్ని రాష్ట్రాల్లో క్రాప్ కాలనీలు ఏర్పాటుచేయాలని కేంద్రప్రభుత్వం ఇటీవలే అధికారులను ఆదేశించింది. రైతులకు కనీస మద్దతు ధర లభించడం కోసం తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఇది మనందరికీ గర్వకారణం. ఇదే విధంగా రైతులకు మంచి ధర లభించడం కోసం ప్రభుత్వపరంగా అన్ని చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం సమగ్ర వ్యూహం రూపొందించాలి అని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో వరి, మక్కలు, పత్తి ఎక్కువగా పండిస్తున్నారు. పండ్ల తోటలున్నాయి. ఇతర పంటలను కూడా అక్కడక్కడ పండిస్తున్నారు. కానీ ఈ పంటల సాగు శాస్త్రీయంగా లేదు. మార్కెట్ పరిస్థితులను బట్టి పండించడం లేదు. ఉత్పాదకత పెరుగాలి. నాణ్యత పెరుగాలి. అప్పుడే రైతులకు మంచి ధర వస్తుంది. కల్తీ విత్తనాలు లేకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నది. ఇంకా కఠినంగా ఉంటుంది. పత్తి దిగుబడి ఎక్కువ రావడం కోసం అనువైన భూముల్లోనే పత్తిసాగు చేయించాలి. మేలురకమైన పత్తి సాగు విధానాలు ప్రపంచంలో ఎక్కడున్నా వాటిని అధ్యయనం చేసి అనుసరించాలి అని సూచించారు.

పంజాబ్ సహా వరి సాగు బాగా జరిగే ప్రాంతాల్లో అధికారులు పర్యటించాలని, మెళకువలు నేర్చుకుని, రైతులకు నేర్పించాలని చెప్పారు. తక్కువ క్యాలరీలు , తక్కువ షుగర్ ఉన్న వరి వంగడాలు సాగుచేయాలి. వరిలో ఎక్కువ దిగుబడి వచ్చే విధంగా రైతులను తీర్చిదిద్దాలి. మక్కజొన్నకు మంచి డిమాండ్ ఉంది. మంచి విత్తనాలు తయారుచేయాలి. ప్రతీరోజు వంటలో వాడే చింతపండుకు కొరత ఉంది. తెలంగాణలో విరివిగా చింతచెట్లు పెంచాలి. హరితహారం కింద కనీసం 5 కోట్ల మొక్కలను రైతులకు ఉచితంగా సరఫరా చేయాలి. పసుపు కొమ్ములను పసుపు పొడిగా, మిరపకాయలను కారం పొడిగా, కందులను పప్పుగా మార్చి అమ్మే పనిని మహిళా సంఘాల ద్వారా చేయించాలి.

స్వచ్ఛమైన పల్లినూనె, నువ్వుల నూనెలను తయారుచేయాలి. దీనివల్ల రైతులకు మంచి ధర వస్తుంది. మహిళలకు ఉపాధి దొరుకుతుంది. కల్తీ సరుకులు కొనే బాధ వినియోగదారులకు తప్పుతుంది. మేలు రకమైన సాగు పద్ధతులను రైతులకు నేర్పడానికి వ్యవసాయ విస్తరణాధికారులను అగ్రానమిస్టులుగా తీర్చిదిద్దాలి. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున అగ్రానమీ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటుచేయాలి. యూనివర్సిటీలో అగ్రానమీ కన్సల్టెన్సీని పెట్టాలి అని చెప్పారు.

## 5.3 సెం.మీ. వాక్యూమ్ క్లీనర్‌కు
# గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్
### హ్యాట్రిక్ సాధించిన తొలి విశ్వవిజేత సాయి



పెద్దాపురంః 'నేను తయారు చేసిన 5.3 సెంటీమీటర్ల వ్యాక్యూమ్ క్లీనర్ 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కినది. ఈ 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్' సర్టిఫికెట్ ఏపీ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప మరియు పెద్దాపురం మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు చేతుల మీదుగా స్వీకరించినాను. ఇది నా మినేచర్ ఆర్ట్స్ కెరీర్లో వరుసగా మూడవ 'గిన్నిస్ వరల్డ్ రికార్డ్' కావడం విశేషం. 2016లో సూక్ష్మ ఎలుకలబోను, 2017లో సూక్ష్మనాటికల్ నాట్ బోర్డు, 2018లో సూక్ష్మ వ్యాక్యూమ్ క్లీనరుకు వరుసగా 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు చేసుకోవడం వలన ప్రపంచంలోనే మినేచర్ ఆర్ట్‌లో హ్యాట్రిక్ 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన తొలి విశ్వవిజేత'గా నిలవడం నాకెంతో ఆనందంగా ఉంది. నేను సాధించిన ఈ రికార్డులు అన్నియు నేను జన్మించిన ఈ పెద్దాపురం పట్టణానికి అంకితం చేస్తున్నాను అని డా. తాళాబత్తుల సాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హ్యాట్రిక్ సాధించిన సందర్భముగా రాష్ట్ర హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప , పెద్దాపురం మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు , మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ సాయిరాం, విశ్వబ్రాహ్మణ సంఘీయులు, టి.ఎస్.ఎన్. హైట్స్ కమిటి సభ్యులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలియచేశారు.

# జిల్లాలో 55 వేల 619 పోస్టల్ బ్యాలెట్లు జారీ

- విశాఖ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కె.భాస్కర్



విశాఖపట్నం: ఈ నెల 11 వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల విధులకు హాజరైన ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకొనేందుకై ఎంతో పారదర్శకంగా 55 వేల 619 పోస్టల్ బ్యాలెట్లను జారీ చేయడం జరిగిందని కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కె.భాస్కర్ తెలిపారు. బుధవారం కలక్టరేట్ లోని తన చాంబరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమై సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జారీ చేసిన పోస్టల్ బ్యాలెట్ల వివరాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5.00 గంటల్లోపు ఫార్మ్-12లో ధరఖాస్తు చేస్తుకున్నారందరికీ ఒక క్రమ పద్ధతిలో పోస్టల్ బ్యాలెట్లు జారీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని మూడు పార్లమెంట్ నియోజక వర్గాలకు 27 వేల 168 పోస్టల్ బ్యాలెట్లు, 15 శాసన సభా నియోజక వర్గాలకు 28 వేల 451 పోస్టల్ బ్యాలెట్లను జారీ చేయడం జరిగిందన్నారు. పోస్టల్ బ్యాలెట్లు పొందిన వారి వివరాలు కలెక్టరేట్లోని హెచ్ - సెక్షన్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయా జాబితాలను ఓట్ల లెక్కింపు అయ్యేంత వరకు బయటకు ఇవ్వమని, అయితే హెచ్ - సెక్షన్లో పరిశీలించుకొనేందుకు మాత్రమే అవకాశం కల్పిస్తామని ఆయన తెలిపారు. గత సార్వత్రిక ఎన్నికల్లో 12 వేల 284 పోస్టల్ బ్యాలెట్లను జారీ చేయడం జరిగిందని తెలిపారు.

( జిల్లాలోని మూడు పార్లమెంట్ నియోజక వర్గాలకు జారీ చేసిన 27 వేల 168 పోస్టల్ బ్యాలెట్లలో అరుకు పార్లమెంట్ నియోజక వర్గానికి 5,967, విశాఖ పార్లమెంట్ నియోజక వర్గానికి 10, 486 మరియు అనకాపల్లి పార్లమెంట్ నియోజక వర్గానికి 10,715 పోస్టల్ బ్యాలెట్లను జారీ చేశామన్నారు. అదే విధంగా జిల్లాలోని 15 శాసన సభా నియోజక వర్గాలకు జారీ చేసిన 28 వేల 451 పోస్టల్ బ్యాలెట్లలో భీమిలి శాసన సభా నియోజక వర్గానికి 3,091, విశాఖ తూర్పుకు 1,721, విశాఖ దక్షిణానికి 1,037, విశాఖ ఉత్తరానికి 1,549, విశాఖ పశ్చిమానికి 1,273, గాజువాకకు 2,028, చోడవరానికి 1,820, మాడుగులకు 1,894, అరుకు వేలీకి 2,772, పాడేరుకు 1,305, అనకాపల్లికి 2,201, పెందుర్తికి 2,235, యలమంచలికి 1,931, పాయకరావు పేటకు 1,430 మరియు నర్సీపట్నం శాసన సభా నియోజక వర్గానికి 2,164 పోస్టల్ బ్యాలెట్లను జారీ చేసినట్లు ఆయన తెలిపారు. నియోజక వర్గం వారీగా ఈ లిస్టులు హెచ్ - సెక్షన్ లో అందుబాటులో ఉన్నాయని, వీటని ఎవరైనా పరిశీలించుకోవచ్చని ఆయన తెలిపారు.

జాయింట్ కలెక్టర్ జె.సృజన, వై.ఎస్.ఆర్.సి.పి. ప్రతినిధులు వి.ఎస్.దివాకర్, కె.రంగయ్య, ఎస్.వి.రమణాజీ, సి.పి.ఐ.(ఎం) ప్రతినిధి వి.హరేంద్ర దాస్, కలెక్టరేట్ హెచ్ - సెక్షన్ సూపరింటెండెంట్ మూర్తి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## గీతం ఆన్‌లైన్ పత్రిక
# 'సైన్స్ఇకో' ఆవిష్కరణ



సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఆన్‌లైన్ వైజ్ఞానిక సమాచార పత్రిక "సైన్స్ ఇకో" ను గీతం ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానంలో వస్తున్న సమకాలీన మార్పులపై ప్రజలలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లోని వివిధ విభాగాలలో జరుగుతున్న పరిశోధనలు ద్వారా తెలయజేయాలని సూచించారు.

గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎమ్.శరత్‌చద్రబాబు మాట్లాడుతూ తమ ఇనిస్టిట్యూట్ ద్వారా బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, పర్యావరణ శాస్త్రంలో అత్యుత్తమ పరిశోధనలు, విజ్ఞాన చర్చలు జరుగుతున్నాయని వీటిని ఆన్‌లైన్ పత్రిక ద్వారా తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆన్‌లైన్ సైన్స్ఇకో సంపాదిక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

# సీఏసీకి దాదా గుడ్‌బై..!

దిల్లీ : క్రికెట్ సలహా మండలి (సీఏసీ)కి దాదా గుడ్‌బై చెప్పే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

సీఏసీ సభ్యుడిగా ఉంటూనే ఐపీఎల్‌లో దిల్లీ క్యాపిటల్స్‌కు సలహాదారుగా పనిచేస్తున్నాడు. విరుద్ధ ప్రయోజనాల అంశంతో దాదాపై ఓ అభిమాని ఫిర్యాదు చేశాడు. ఇప్పటికే సౌరభ్‌కు నోటీసులు జారీ చేసిన అంబుడ్స్‌మన్.. తన ముందు నేరుగా హాజరు కావాలని ఆదేశించారు. దీంతో శనివారం బీసీసీఐ అంబుడ్స్‌మన్ డీకే జైన్ ముందు దాదా హాజరు కానున్నాడు. దీంతో గంగూలి రెండింట్లో ఏదో ఒకటి వదులుకోవాల్సిన పరిస్థితుల్లో సీఏసీని దూరం కానున్నట్లు సమాచారం దాదాతో పాటు సచిన్, వీవీఎస్ లక్ష్మణ్ కూడా సీఏసీలో సభ్యులుగా ఉన్నారు.

## ప్రపంచకప్ స్టాండ్‌బై ఆటగాళ్లుగా
# పంత్, రాయుడు

దిల్లీ: ప్రపంచకప్‌కు ఎంపికవ్వని వెటరన్ బ్యాట్స్‌మన్ అంబటి రాయుడు, యువ వికెట్‌కీపర్ రిషభ్ పంత్‌కు కాస్త ఊరట! వీరిద్దరినీ ప్రపంచకప్ జట్టుకు స్టాండ్‌బై ఆటగాళ్లుగా బీసీసీఐ ప్రకటించింది. ప్రస్తుతం ఎంపికైన 15 మందిలో ఎవరైనా గాయపడితే వీరు ఇంగ్లాండ్ వెళ్లే విమానం ఎక్కుతారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఆడుతున్న పేసర్ నవ్‌దీప్ సైనీని సైతం స్టాండ్‌బై జాబితాలో చేర్చారు. పంత్, రాయుడుని ప్రపంచకప్ జట్టుకు ఎంపిక చేయకపోవడంతో సెలక్టర్లపై విమర్శలు వస్తున్నాయి. సునిల్ గావస్కర్, గౌతమ్ గంభీర్ సహా మరికొందరు మాజీలు వీరికి అండగా నిలిచారు. అయితే ప్రస్తుతం స్టాండ్‌బై ఎంపిక చేసిన వారినే కాకుండా అవసరమైతే ఎవరినైనా అక్కడికి పంపించొచ్చు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ తరహాలోనే మనకిప్పుడూ ముగ్గురు స్టాండ్‌బై ఆటగాళ్లు ఉన్నారు. రిషభ్ పంత్, అంబటి రాయుడు బ్యాట్స్‌మన్ కాగా సైనీ బౌలర్ల జాబితాలో ఉన్నాడు. ప్రస్తుత జట్టులో ఎవరైనా గాయపడితే వీరి ముగ్గురిలో ఎవరో ఒకరు అక్కడికి వెళ్తారు అని బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ఖలీల్ అహ్మద్, అవేశ్ ఖాన్, దీపక్ చాహర్ అధికారికంగా స్టాండ్‌బై ఆటగాళ్లు కారు. బౌలర్లు ఎవరైనా గాయపడితే వీరిలో ఎవరితోనైనా భర్తీ చేసే అవకాశం ఉంది. పూర్తిగా బ్యాట్స్‌మన్ అయితే రాయుడు లేదా పంత్‌కు అవకాశం దక్కుతుంది అని ఆ అధికారి తెలిపారు. ప్రస్తుతం క్రికెటర్లు విరామం లేకుండా ఐపీఎల్ ఆడుతుండటంతో ప్రపంచకప్ ముందు యోయో పరీక్ష ఉండదన్నారు. రెండు టోర్నీలకు మధ్య 10 రోజుల విరామమే ఉండటంతో శారీరక బడలిక పోయేందుకు సమయం అవసరమని అన్నారు.

# స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రత

- ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంలకు 4 స్ట్రాంగ్‌రూంలు
- మొదటి అంచెలో సీఆర్‌పీఎఫ్. తరువాత ఏపీఎస్‌పీ, తరువాత లోకల్ పోలీసుల పహారా
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- నగర సీపీ ద్వారకా తిరుమల రావు



విజయవాడ: విజయవాడ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించిన ఈవీఎంలను ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో భద్రత పర్చామని విజయవాడ నగర సీపీ ద్వారకా తిరుమల రావు తెలిపారు. విజయవాడలో తిరుమల రావు బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలకు 4 స్ట్రాంగ్ రూంలు కేటాయించామని, మొత్తం 28 స్ట్రాంగ్ రూంలలో ఈవీఎంలు భద్రపరిచినట్లు తెలిపారు. ప్రతి స్ట్రాంగ్‌రూమ్‌కి 2 తాళాలు ఉన్నాయని చెప్పారు.

మొదటి అంచెలో స్ట్రాంగ్ రూం వద్ద సీఆర్‌పీఎఫ్ పహారా, రెండో అంచెలో ఏపీఎస్‌పీ సిబ్బంది, మూడో అంచెలో లోకల్ పోలీసులు పహారా కాస్తారని తెలిపారు.

ఎవరు లోపలికి వెళ్లినా లాగ్ బుక్‌లో నమోదు చేస్తారని స్పష్టంగా పేర్కొన్నారు. మొత్తం 28 సీసీ కెమెరాలు ఉన్నాయని, సీసీ కెమెరాలు కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేశారని వెల్లడించారు.

అనుమతి ఉన్నవారికి మాత్రమే లోపలి అనుమతి ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించి లోపలికి చొరబడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

చదవండి.. చదివించండి
విజయభాను

# రోడ్డు ప్రమాదంలో బుల్లితెర నటీమణులు
# భార్గవి, అనుషా రెడ్డి మృతి





హైదరాబాద్ః బుల్లితెర నటీమణులు భార్గవి, అనుషా రెడ్డి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఓ షూటింగ్ నిమిత్తం వికారాబాద్ జిల్లా అనంతగిరి అడవులకు వెళ్లిన టీమ్, తిరుగుప్రయాణమై వస్తున్న వేళ ఎదురుగా వచ్చిన లారీని తప్పించబోయి.. టీవీ ఆర్టిస్టుల కారు చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో టీవీ ఆర్టిస్టులు అనుషా రెడ్డి, భార్గవి తీవ్రగాయాలతో అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘోర ప్రమాదం చేవెళ్ల సమీపంలోని అప్పారెడ్డి గూడ బస్టాప్ వద్ద జరిగింది.

ఓ సీరియల్ కోసం వీరు షూటింగ్ ముగించుకుని హైదరాబాద్ వస్తుండగా ప్రమాదం జరిగింది. కారులో నలుగురు ప్రయాణిస్తుండగా, నిర్మల్‌కు చెందిన భార్గవి (20), భూపాలపల్లి జయశంకర్ జిల్లాకు చెందిన అనుషారెడ్డి (21) మరణించారు.

కారు డ్రైవర్ చక్రి, వీరితో పాటు ప్రయాణిస్తున్న వినయ్ కుమార్ లకు తీవ్ర గాయాలు కాగా, వీరిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

# ఐఎన్ఎస్ సాత్పూరాకు ఉత్తమ నౌక అవార్డు












విశాఖపట్నం : 2018-2019 సంవత్సరానికి గాను నిర్వహించిన ఈస్టర్న్ ఫ్లీట్ అవార్డు ఫెల్లోస్‌లో తూర్పు నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ సాత్పూరాకు ఉత్తమ నౌక అవార్డు లభించింది. దేశరక్షణలో సరిహద్దు భద్రతలో దాని పాత్రకు గానూ ఈ అవార్డును అందజేశారు. తూర్పు నౌకాదళ కమాండింగ్ చీఫ్ వైస్ అడ్మిరల్ కరంబీర్ సింగ్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com